తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460


https://epaper.tharangalu.in
జాతీయ దిన ప్రతిక
RNI. TELTEL / 2022 / 83463
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
03 సెప్టెంబర్ 2026
సంపుటి 03
సంచిక 325
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## ఆకాశాన్ని తాకిన మానవ మేధస్సుకు గుర్తింపు

- ఆధునిక నగరాల అభివృద్ధికి ప్రతీక
- ఇంజనీరింగ్ రంగం అద్భుత విజయగాథ
- ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్న ఎత్తైన భవనాలు
- భవిష్యత్ నగరాల నిర్మాణానికి మార్గదర్శకాలు



డెస్క్, సెప్టెంబర్ 2 ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 3న ప్రపంచ స్కైస్క్రాపర్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆధునిక ఇంజినీరింగ్, వాస్తుశిల్పం, నిర్మాణ సాంకేతికత సాధించిన అద్భుత విజయాలను గుర్తు చేసుకోవడానికి ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. నగరాల అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచిన ఆకాశహర్మ్యాలు మానవ మేధస్సు, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు నివసించే, పనిచేసే ఈ భారీ నిర్మాణాలు ఆధునిక నాగరికతకు కొత్త రూపాన్ని అందించాయి. ప్రపంచ స్కైస్క్రాపర్ దినోత్సవాన్ని ప్రముఖ అమెరికన్ వాస్తుశిల్పి విలియం లే బారన్ జెన్నీ జయంతి సందర్భంగా నిర్వహిస్తారు. ఆయనను "ఫాదర్ ఆఫ్ ది స్కైస్క్రాపర్"గా పిలుస్తారు. 1885లో చికాగోలో

➢ మిగతా 2వ పేజిలో..



# వాతావరణ విపత్తుకు నష్టపరిహారం చెల్లించాలి


- భారత్, చైనా, అమెరికాకు నేపాల్ విజ్ఞప్తి!
- భోటేకోషి వరదలతో తీవ్ర విధ్వంసం
- వాతావరణ మార్పులే విపత్తుకు కారణమంటున్న నేపాల్
- సాయం కాదు.. న్యాయం, నష్టపరిహారం కావాలంటూ డిమాండ్
- పునర్నిర్మాణానికి రూ.లక్షల కోట్ల మేర అవసరమని అంచనా

డెస్క్, సెప్టెంబర్ 2, : నేపాల్‌ను ఆకస్మిక వరదలు, జలప్రళయం తీవ్రంగా దెబ్బతీసిన నేపథ్యంలో ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చింది. వాతావరణ మార్పులకు అధికంగా కారణమవుతున్న దేశాల నుంచి నష్టపరిహారం పొందాలని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ కోరారు. భారత్, చైనా, అమెరికా వంటి భారీ స్థాయిలో

➢ మిగతా 2వ పేజిలో..

## వైఎస్సార్ ఆశయాలే లక్ష్యం

- ప్రాణహిత, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి పూర్తి చేస్తాం: రేవంత్‌రెడ్డి
- 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టుల నిర్మాణం
- రైతుల ఆత్మగౌరవం కోసం వైఎస్సార్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకం
- రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన మహానేత వైఎస్సార్
- ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థకు వైఎస్సార్ పురస్కారం




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయమైన ప్రాణహిత--చేవెళ్ల, శ్రీశైలం ఎడమ గట్టు కాలువ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో డాక్టర్ వైఎస్సార్--డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పురస్కారం- -2026 ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ కలలుగన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం తమ ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థకు ఈ ఏడాది వైఎస్ రాజశేఖరరెడ్డి పురస్కారాన్ని అందజేశారు. రైతులు, గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన వైఎస్సార్ సేవలను గుర్తుచేసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను ముఖ్యమంత్రి అభినందించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి,

➢ మిగతా 2వ పేజిలో..



## శాంతి, భద్రత, సుస్థిరతకు షాంఘై సహకార సంస్థ బలోపేతం: మోదీ

- బిష్కెక్‌లో 26వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ
- సార్వత్రిక అభివృద్ధికి విశ్వసనీయ అనుసంధానం అవసరం
- సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాల్సిందే
- వాతావరణం నుంచి మాదకద్రవ్యాల నియంత్రణ వరకు కీలక నిర్ణయాలు

బిష్కెక్, సెప్టెంబర్ 2, కిర్గిజ్ గణరాజ్య రాజధాని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర

➢ మిగతా 2వ పేజిలో..

## రైతులు, ఉపాధ్యాయులకు భారీ ఊరట

- కేసుల ఉపసంహరణకు టీవీకే ప్రభుత్వ నిర్ణయం
- డీఎంకే హయాంలో నమోదైన కేసుల రద్దు
- అసెంబ్లీలో సీఎం విజయ్ కీలక ప్రకటన
- ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకే నిర్ణయమన్న ప్రభుత్వం



చెన్నై, సెప్టెంబర్ 2 తమిళనాడులో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్య మంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్ణయంతో వేలాది మంది రైతులు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులకు భారీ ఊరట లభించింది. ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడిన వారిపై నమోదైన కేసులను కొనసాగించడం సమంజసం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2021 మే నుంచి 2026 వరకు డీఎంకే ప్రభుత్వ పాలనలో సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా రైతులు, స్థానిక ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలు విస్తృతంగా ఆందోళనలు నిర్వహించాయి. ఈ నిరసనల సందర్భంగా పలువురిపై కేసులు

➢ మిగతా 2వ పేజిలో..




## ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

- డిఫెన్స్ ఎక్స్‌పో-2026 ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రితో సీఎం భేటీ
- భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు సదస్సు
- ఎయిర్‌షో, డిఫెన్స్ ప్రదర్శనలకు సహకారం కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు, డీఆర్‌డీఎల్ ప్రాజెక్టులపై చర్చ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించారు. ఢిల్లీలో ఆయనతో సమావేశమైన సీఎం, భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. సదస్సులో భాగంగా నిర్వహించే డిఫెన్స్ ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, రక్షణ రంగ అవకాశాలకు సంబంధించిన పలు అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. డిఫెన్స్ ఎక్స్‌పో-2026లో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. ప్రతిష్టాత్మక ఎయిర్‌షోతో పాటు పారిశ్రామిక ప్రదర్శనలు, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. ఇలాంటి వేదికలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని మార్గనిర్దేశం చేస్తే దేశ యువతకు, పరిశ్రమలకు మరింత స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో డిఫెన్స్ ఎక్స్‌పోను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ పూర్తి సహకారం అందించాలని సీఎం కోరారు. ముఖ్యంగా ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు మంజూరు చేయడంతో పాటు

➢ మిగతా 2వ పేజిలో..

## నన్ను బాధ్యురాలిని చేయొద్దు



- కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని విజ్ఞప్తి
- రాజీనామాపై కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు.. అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూపులు
- ఖర్గేతో భేటీ.. తన వివరణను అధిష్ఠానానికి అందజేత
- మంత్రిగా కొనసాగించాలని కాంగ్రెస్ పెద్దలను కోరిన సురేఖ
- తనపై ఆరోపణలు చేయించిన వారెవరో తెలుసంటూ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2,: తన విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి చెప్పాల్సినవన్నీ చెప్పానని, ఇక పార్టీ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నానని తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయినట్లు వెల్లడించిన ఆమె, తనను ఇప్పటివరకు రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని తెలిపారు. తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని అధిష్ఠానానికి వివరించినట్లు చెప్పారు. తన వ్యవహారంపై పార్టీ పెద్దలు చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తనకు తెలియదని, అయితే తన వాదనను పూర్తిగా

➢ మిగతా 2వ పేజిలో..




## రైతు నుంచి నిరుద్యోగి వరకు.. అందరికీ అన్యాయమే

- కాంగ్రెస్ 1000రోజుల పాలనపై బీఆర్ఎస్ 'ఛార్జ్‌షీట్'
- ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- రైతులు,మహిళలు, యువత,నిరుద్యోగులకు తీవ్ర నిరాశ
- ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్నికల

➢ మిగతా 2వ పేజిలో..

# వాతావరణ విపత్తుకు నష్టపరిహారం చెల్లించాలి

గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు విడుదల చేస్తున్న దేశాలు వాతావరణ మార్పుల కారణంగా నష్టపోతున్న దేశాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. విపత్తు కారణంగా నేపాల్‌లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన వేళ ఈ డిమాండ్ అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.భోటేకోషి నదిలో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా నేపాల్‌లో తీవ్ర విధ్వంసం చోటుచేసుకున్నట్లు ఆ దేశ ప్రభుత్వం వెల్లడించింది. ఈ విపత్తులో ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతైనట్లు నేపాల్ పేర్కొంది. భారీ వరదల ధాటికి అనేక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో ప్రజల సాధారణ జీవనం స్తంభించిన పరిస్థితి నెలకొంది. రహదారులు, వంతెనలు, నివాస ప్రాంతాలు, ఇతర ప్రజా మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో సహాయక చర్యలతో పాటు భారీ స్థాయిలో పునర్నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది.

ఈ విపత్తుకు వాతావరణ మార్పుల ప్రభావమే ప్రధాన కారణమని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నట్లు సమాచారం. ఉష్ణోగ్రతలు పెరగడం, హిమనీనదాలపై తీవ్ర ప్రభావం పడటం వంటి పరిణామాల నేపథ్యంలో ఆకస్మిక వరదలు, జలప్రళయాలు మరింత తీవ్రమవుతున్నాయని నేపాల్ వాదిస్తోంది. వాతావరణ మార్పులకు తమ దేశం పెద్దగా కారణం కాకపోయినా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల నుంచి వెలువడుతున్న అధిక ఉద్గారాల ప్రభావాన్ని మాత్రం నేపాల్ వంటి దేశాలు తీవ్రంగా ఎదుర్కొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ఉద్గారాలు చేసే దేశాలు అధిక నష్టాలను చవిచూడాల్సి వస్తున్న పరిస్థితిని అంతర్జాతీయ సమాజం గుర్తించాలని కోరారు.

తమకు కావాల్సింది కేవలం మానవతా సాయం కాదని, వాతావరణ మార్పుల వల్ల జరిగిన నష్టానికి న్యాయం, నష్టపరిహారం కావాలని నేపాల్ స్పష్టం చేస్తోంది. అందించే సహాయాన్ని భిక్షగా చూడకూడదని, వాతావరణ సంక్షోభం కారణంగా జరిగిన నష్టానికి బాధ్యత వహించే దేశాల నుంచి రావాల్సిన నైతిక, చట్టపరమైన బాధ్యతగా పరిగణించాలని శిశిర్ ఖనాల్ పేర్కొన్నట్లు సమాచారం. ఈ దిశగా నేపాల్ తన దౌత్య విధానాన్ని కూడా మార్చుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు అంతర్జాతీయ సమాజం నుంచి సాయం కోరే ధోరణికి బదులుగా, వాతావరణ నష్టానికి పరిహారం, న్యాయం పొందే అంశాన్ని ప్రధానంగా ముందుకు తీసుకెళ్లాలని నేపాల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలు, నష్టం పరిహారానికి సంబంధించిన నిధి దృష్టికి తీసుకెళ్లాలని నేపాల్ భావిస్తోంది. రానున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కూడా ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. విపత్తు కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించడంతో పాటు బాధిత కుటుంబాలకు సహాయం అందించడం, దీర్ఘకాలిక పునరావాస చర్యలు చేపట్టడం కోసం భారీగా నిధులు అవసరమవుతున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు 4 నుంచి 5 బిలియన్ అమెరికా డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.నేపాల్ తాజా డిమాండ్ నేపథ్యంలో వాతావరణ నష్టపరిహారం అంశం మరోసారి అంతర్జాతీయ చర్చకు వచ్చే అవకాశం ఉంది. వాతావరణ మార్పులకు తక్కువగా కారణమయ్యే అభివృద్ధి చెందుతున్న, పర్వత దేశాలు తీవ్ర విపత్తులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాల బాధ్యతపై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. నేపాల్ ఇప్పుడు తనకు జరిగిన నష్టాన్ని అంతర్జాతీయ వేదికలపై బలంగా ప్రస్తావిస్తూ నష్టపరిహారం కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. భారీ ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం నేపథ్యంలో పునర్నిర్మాణానికి అవసరమైన వనరులను సమీకరించడమే కాకుండా, భవిష్యత్‌లో ఇలాంటి విపత్తుల ప్రభావాన్ని తగ్గించేందుకు అంతర్జాతీయ సహకారం పొందడం కూడా నేపాల్‌కు కీలకంగా మారింది.

## రైతులు, ఉపాధ్యాయులకు భారీ ఊరట

నమోదు అయ్యాయి. శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన వారిపై కూడా కేసులు పెట్టడం వల్ల అనేక మంది న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని విజయ్ పేర్కొన్నారు. ఈ కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో బాధితులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసెంబ్లీలో ఈ అంశంపై మాట్లాడిన ముఖ్యమంత్రి విజయ్, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని అన్నారు. ప్రజల సమస్యలను వినడం, పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని, వాటిని అణచివేయడం కాదని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై స్పందించిన వారిని నేరస్థులుగా చూడడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. అందుకే గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకోవాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.డీఎంకే ప్రభుత్వ హయాంలో కొన్ని కీలక ప్రాజెక్టుల అమలు విషయంలో స్థానిక ప్రజల అభ్యంతరాలను పెద్దగా పట్టించుకోలేదని విజయ్ విమర్శించారు. ముఖ్యంగా పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టు కోసం భూముల సేకరణ సమయంలో రైతులు వ్యక్తం చేసిన ఆందోళనలను విస్మరించారని ఆరోపించారు. అదే విధంగా ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ఆందోళనలపై కూడా కేసులు నమోదు చేయడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించే కొత్త రాజకీయ సంస్కృతికి తమ ప్రభుత్వం నాంది పలుకుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రైతు సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించాయి. ఎన్నో సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారికి ఇది పెద్ద ఉపశమనం అని అభిప్రాయపడ్డాయి. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలనే సంకేతాన్ని ఈ నిర్ణయం ఇస్తోందని వారు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉండగా, 'నీట్' పరీక్షకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించిన విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని సీపీఐ పార్టీ డిమాండ్ చేస్తోంది. అలాగే ఎన్ఎల్‌సీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడిన ఆందోళనకారులపై నమోదైన కేసులను రద్దు చేయాలని పీఎంకే కోరుతోంది. అయితే ఈ అంశాలపై టీవీకే ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. రైతులు, ఉపాధ్యాయుల కేసుల ఉపసంహరణ తర్వాత విద్యార్థులు, ఇతర ఉద్యమకారుల కేసుల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందా అనే అంశంపై తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

# ఆకాశాన్ని తాకిన మానవ మేధస్సుకు గుర్తింపు

నిర్మించిన హోమ్ ఇన్సూరెన్స్ బిల్డింగ్‌ను ప్రపంచంలో తొలి స్కైస్క్రాపర్‌గా గుర్తిస్తారు. ఉక్కు ఫ్రేమ్ నిర్మాణ పద్ధతిని ఉపయోగించడం ద్వారా భవనాలను మరింత ఎత్తుగా నిర్మించే అవకాశాన్ని ఆయన ప్రపంచానికి పరిచయం చేశారు.

జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పరిమిత భూవనరుల నేపథ్యంలో ఎత్తైన భవనాల అవసరం పెరిగింది. ఒకే స్థలంలో వేలాది మంది నివసించేందుకు, వందలాది కార్యాలయాలు పనిచేయేందుకు స్కైస్క్రాపర్లు అనువైన పరిష్కారంగా మారాయి. ముఖ్యంగా మహానగరాల్లో భూమి విలువలు పెరగడంతో నిలువుగా అభివృద్ధి చెందే నిర్మాణాలకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో ప్రపంచంలోని అనేక నగరాలు ఆకాశహర్మ్యాల కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా. సుమారు 828 మీటర్ల ఎత్తుతో ఈ భవనం ఆధునిక ఇంజినీరింగ్ సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దాని తరువాత మలేషియాలోని మెర్డెకా 118, చైనాలోని షాంఘై టవర్, మక్కా క్లాక్ రాయల్ టవర్, పింగ్ ఆన్ ఫైనాన్స్ సెంటర్ వంటి భవనాలు ప్రపంచంలోని అత్యంత ఎత్తైన నిర్మాణాల జాబితాలో ఉన్నాయి. ఈ భవనాలు కేవలం కార్యాలయాలు లేదా నివాస సముదాయాలు మాత్రమే కాకుండా ఆయా దేశాల ప్రతిష్ఠకు చిహ్నాలుగా మారాయి.

స్కైస్క్రాపర్ల నిర్మాణం వెనుక అత్యాధునిక సాంకేతికత పనిచేస్తుంది. బలమైన ఉక్కు నిర్మాణాలు, భూకంప నిరోధక వ్యవస్థలు, అధునాతన లిఫ్ట్ సాంకేతికత, గాలి ఒత్తిడిని తట్టుకునే డిజైన్‌లు వంటి అంశాలు ఈ భవనాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒక చిన్న పొరపాటు కూడా భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉండటంతో ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటారు. అందుకే స్కైస్క్రాపర్ నిర్మాణాన్ని ఇంజినీరింగ్ రంగంలో అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా భావిస్తారు. ఆధునిక స్కైస్క్రాపర్లు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. సౌరశక్తి వినియోగం, వర్షపు నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా చేసే వ్యవస్థలు, హరిత నిర్మాణ పద్ధతులు వంటి అంశాలను కొత్త భవనాల్లో అమలు చేస్తున్నారు. దీంతో నగరాల్లో పెరుగుతున్న పర్యావరణ సమస్యలను తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. భవిష్యత్ నగరాల నిర్మాణంలో సుస్థిర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా మారుతోంది.భారతదేశంలో కూడా స్కైస్క్రాపర్ల నిర్మాణం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా ముంబై, హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్, నోయిడా వంటి నగరాల్లో భారీ ఎత్తైన భవనాలు నిర్మితమవుతున్నాయి. వ్యాపార, ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణతో పాటు నగరాల అభివృద్ధికి ఈ నిర్మాణాలు దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న భారతీయ స్కైస్క్రాపర్లు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. స్కైస్క్రాపర్లు కేవలం భవనాలు మాత్రమే కాదు, ఒక దేశ ఆర్థిక పురోగతికి సూచికలుగా కూడా పరిగణించబడుతున్నాయి. భారీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, నిర్మాణ నైపుణ్యం, పట్టణ అభివృద్ధి సామర్థ్యాన్ని అవి ప్రతిబింబిస్తాయి. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాలు ఎక్కువగా ఆకాశహర్మ్యాలతోనే గుర్తింపు పొందుతున్నాయి. అందువల్ల స్కైస్క్రాపర్లు అభివృద్ధి, ఆధునికతకు చిహ్నాలుగా నిలుస్తున్నాయి.అయితే స్కైస్క్రాపర్ల నిర్మాణం కొన్ని సవాళ్లను కూడా తెస్తోంది. అధిక నిర్మాణ వ్యయాలు, పర్యావరణ ప్రభావాలు, ట్రాఫిక్ సమస్యలు, ఇంధన వినియోగం వంటి అంశాలు పట్టణ ప్రణాళికలో కీలకంగా మారాయి. అందువల్ల ఆధునిక నగరాలు అభివృద్ధి చెందుతున్నప్పుడు సుస్థిరత, భద్రత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రపంచ స్కైస్క్రాపర్ దినోత్సవం మానవ మేధస్సు ఎంతటి అద్భుతాలను సృష్టించగలదో గుర్తు చేస్తుంది. ఆకాశాన్ని తాకే భవనాలు కేవలం కాంక్రీట్ నిర్మాణాలు మాత్రమే కాదు, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతికి ప్రతీకలు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూ ఆధునిక నగరాల అభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తున్న ఈ ఆకాశహర్మ్యాలు మానవ నాగరికత విజయగాథలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

# వైఎస్సార్ ఆశయాలే లక్ష్యం

ఆహార భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చిన మహనీయుల సేవలను స్మరించుకోవడం సమాజానికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. వ్యవసాయ రంగానికి శాస్త్రీయ పరిశోధనలను అనుసంధానం చేయడంలో స్వామినాథన్ పరిశోధనా సంస్థ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.రైతులు, నిరుపేదల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు 2003లో మండుటెండలో వైఎస్సార్ చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రను రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను కలుస్తూ వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న వైఎస్సార్, రైతుల పరిస్థితులను చూసి చలించిపోయారని పేర్కొన్నారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచడంతో పాటు వ్యవసాయానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న సంకల్పంతో వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజల మనస్సుల్లో నిలిచిపోయాయని అన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే దస్త్రంపై తొలి సంతకం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అప్పట్లో రైతులపై ఉన్న సుమారు రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.

## నన్ను బాధ్యురాలిని చేయొద్దు

వారి ముందుంచానని కొండా సురేఖ పేర్కొన్నారు.తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని సురేఖ తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పదవిలో కొనసాగాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరినట్లు చెప్పారు. తన కుమార్తె సుస్మితకు వివాహమైందని, ఆమె తనకు స్వతంత్రంగా జీవిస్తున్న వ్యక్తి అని వివరించారు. ఆమె తన అభిప్రాయాలను వ్యక్తం చేసే విషయంలో తాను జోక్యం చేసుకునే పరిస్థితి లేదన్నారు. పెళ్లి తర్వాత ఆమె తన అత్తింటి కోడలిగా మాట్లాడి ఉంటుందని తాను భావిస్తున్నానని, ఆమె జీవితం ఆమె ఇష్టమని స్పష్టం చేశారు. అదే విధంగా తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం కూడా తమ వ్యక్తిగత నిర్ణయాలకు సంబంధించినదని కొండా సురేఖ పేర్కొన్నారు.

తన కుమార్తె వ్యాఖ్యలపై తాను ఖండన గానీ, సమర్థన గానీ చేయబోనని మంత్రి స్పష్టం చేశారు. రోజూ ఎంతో మంది వివిధ అంశాలపై మాట్లాడుతుంటారని, అందులో తన కుమార్తె కూడా ఒకరని అన్నారు. అయితే ఆమె తన బిడ్డ కాబట్టి ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. తన కుమార్తె స్వతంత్రంగా ఉన్న మహిళ అని, ఆమె ఏం మాట్లాడాలి, ఏం మాట్లాడకూడదని ఆదేశించే హక్కు తనకు లేదని చెప్పారు. ఈ అంశంపై తన వివరణను కాంగ్రెస్ అధిష్ఠానానికి అందజేశానని, మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించానని వెల్లడించారు. అధిష్ఠానానికి తాను చెప్పిన విషయాలను ఆమె కూడా తెలియజేస్తానని చెప్పినట్లు సురేఖ తెలిపారు.ఇదే సమయంలో పార్టీలో కొందరు వ్యక్తులు తనపై ఆరోపణలు చేయించారని కొండా సురేఖ ఆరోపించారు. తనపై ఎవరు ఆరోపణలు చేయించారో తనకు తెలుసని, అయితే వారి పేర్లు వెల్లడిస్తే మరింత వివాదం తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. తనపై ఆరోపణలు చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని, వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని ఆమె అన్నారు. తాను ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నందువల్లే దిల్లీకి వచ్చి తన బాధను పార్టీ పెద్దల దృష్టికి తీసుకువచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు కూడా రాతపూర్వకంగా తన వివరణను అందజేసినట్లు చెప్పారు.

# శాంతి, భద్రత, సుస్థిరతకు షాంఘై సహకార సంస్థ బలోపేతం: మోదీ

మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది షాంఘై సహకార సంస్థ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సదస్సులో సభ్యదేశాల నేతలు సంస్థ ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వం, సుసంపన్నత కోసం సంస్థ పాత్రను మరింత బలోపేతం చేసే మార్గాలపై నేతలు తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ప్రాంతీయ సహకారం మరింత విస్తరించాల్సిన అవసరాన్ని సదస్సు ప్రధానంగా చర్చించింది.

సభ్యదేశాల ఉమ్మడి పురోగతి, ఆర్థిక సుసంపన్నతకు బలమైన, విశ్వసనీయమైన అనుసంధాన వ్యవస్థలు ఎంతో ముఖ్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వివిధ దేశాల మార్కెట్లను అనుసంధానించడం, వాణిజ్యాన్ని విస్తరించడం, అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరవడం వంటి లక్ష్యాలతో చేపట్టే అనుసంధాన కార్యక్రమాలకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే ఇటువంటి ప్రాజెక్టులు ఆయా దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను పూర్తిగా గౌరవించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. పరస్పర విశ్వాసం, సమాన భాగస్వామ్యం ఆధారంగా చేపట్టే అనుసంధాన కార్యక్రమాలే దీర్ఘకాలికంగా ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ప్రాంతీయ సహకారాన్ని మరింత విస్తరించేందుకు సదస్సులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బిష్కెక్ ప్రకటనతో పాటు నాలుగు అవగాహన ఒప్పందాలు, ఇరవైకి పైగా నిర్ణయాలు, ప్రకటనలను సభ్యదేశాలు ఆమోదించాయి. వాతావరణ మార్పులు, అణు భద్రత, ఇంధన పరిరక్షణ, మాదకద్రవ్యాల వ్యసనాన్ని అరికట్టడం వంటి విభిన్న రంగాలకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. సభ్యదేశాల మధ్య సమన్వయాన్ని పెంచడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు, భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.బిష్కెక్ ప్రకటనలో భారత్ నాయకత్వం వహించిన, మద్దతు తెలిపిన పలు కార్యక్రమాలకు కూడా చోటు లభించింది. షాంఘై సహకార సంస్థ నిబంధనల్లో ఇంగ్లిష్‌ను అధికారిక భాషగా చేర్చే అంశం, నాగరికతల మధ్య సంభాషణ వేదిక, యువ శాస్త్రవేత్తల వేదిక, యువ రచయితల సదస్సు వంటి కార్యక్రమాలు ఇందులో ఉన్నాయి. వివిధ దేశాల యువత, శాస్త్రవేత్తలు, రచయితలు పరస్పరం తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకునే అవకాశాలను పెంచడం ద్వారా సంస్థ భవిష్యత్ సహకారానికి కొత్త దిశను అందించవచ్చుని భావిస్తున్నారు.షాంఘై సహకార సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా సభ్యదేశాల మధ్య సహకారాన్ని మరింత లోతుగా తీసుకెళ్లాల్సిన అవసరాన్ని సదస్సు ప్రతిబింబించింది. ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వంతో పాటు ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని నేతలు అభిప్రాయపడ్డారు. పరస్పర ప్రయోజనాలను గౌరవిస్తూ, దేశాల సార్వభౌమత్వాన్ని కాపాడుతూ చేపట్టే కార్యక్రమాల ద్వారా మాత్రమే దీర్ఘకాలిక సహకారం సాధ్యమవుతుందని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

బిష్కెక్ శిఖరాగ్ర సదస్సులో భారత్ చురుకైన పాత్ర పోషించడంతో పాటు పలు కీలక కార్యక్రమాలకు మద్దతు అందించింది. అనుసంధానం, వాణిజ్యం, శాస్త్ర సాంకేతిక రంగాలు, యువత భాగస్వామ్యం, పర్యావరణం, ఇంధన పరిరక్షణ, ప్రజల భద్రత వంటి అంశాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు భారత్ ప్రాధాన్యం ఇచ్చింది. శాంతి, భద్రత, స్థిరత్వం, సుసంపన్నత కోసం షాంఘై సహకార సంస్థను మరింత సమర్థవంతమైన వేదికగా తీర్చిదిద్దడంలో భారత్ తన వంతు పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని సదస్సు ద్వారా స్పష్టమైంది.

# ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనతో పాటు భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను కూడా ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని కోరారు.రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా సంస్థల భాగస్వామ్యంపై కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీఓ ప్రయోగశాలలు పెద్ద ఎత్తున పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని సూచించారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, అంతర్జాతీయ రక్షణ సంస్థలు, ద్వైపాక్షిక రక్షణ బృందాలతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకారం అందించాలని కోరారు. దీంతో తెలంగాణను రక్షణ తయారీ, పరిశోధన రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలు మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిని కూడా సీఎం రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని, రక్షణ శాఖ సూచనల మేరకు మరో 750 ఎకరాలు సేకరించి మొత్తం 1500 ఎకరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విమానాశ్రయ అభివృద్ధి ఉత్తర తెలంగాణ ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక రక్షణ పరిశోధన ప్రాజెక్టుపై కూడా చర్చ జరిగింది. ఈ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు టీజీఐఐసీ ఇప్పటికే అంగీకరించిందని సీఎం వివరించారు. మొత్తం భూమిని సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల పాటు కేటాయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు నుంచి నిరుద్యోగి వరకు.. అందరికీ అన్యాయమే

సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు పరిస్థితులు, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఖరిని ప్రస్తావిస్తూ ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందుంచారు.

### హామీల అమలులో విఫలం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలతో తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

### వ్యవసాయం నుంచి ఆరోగ్యం వరకు..

ఛార్జ్‌షీట్‌లో వ్యవసాయం, ఉపాధి, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఆయా రంగాల్లో ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 03 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మహిళా సమాఖ్య భవనం నిర్మాణం చేయడంలో ప్రభుత్వాలు విఫలం సీపీఐ

•శిలాఫలకం వద్ద నిరసన



**జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 2,(తరంగాలు)**: మండల కేంద్రంలో స్వర్ణభారతి మహిళ సమాఖ్య భవనం నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మండల కమిటి బృందం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 32 లక్షల రూపాయలతో మంజూరైన భవనం శంకుస్థాపన 10 సంవత్సరాల క్రితం చేసినా శిలాఫలకం వద్ద నిరసన చేయడం జరిగిందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మండల కార్యదర్శి జువారి.రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో స్వర్ణభారతి మహిళ సమాఖ్య ఒక కోటి 93 లక్షలతో 935 గ్రామీణా గ్రూపులతో 9815 మంది సభ్యులతో నడుస్తున్న సంఘానికి ఒక భవనం లేకపోడం సిగ్గుచేటన్నారు గత పాలకులు శంకుస్థాపనలు చేసి గాలికి వదిలారు తుతూ మంత్రశీగా అప్పటి కాంట్రాక్టర్ పిల్లర్ల కోసం పని చేయించి అలాగే వదిలారు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు అద్దె భవనంలో ఉన్నటువంటి పరిస్థితి ఉంది ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మహిళ సమాఖ్య భవనాన్ని పునర్నిర్మాణం చేపట్టేదానికి కృషి చేయాలని కోరారు.అప్పటి కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో మహిళలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో రైతు మండల అధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా,మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ. సుధాకర్,వేల్పుల పెద్దరాములు,మంద బుచ్చయ్య, ఎండీ జాఫర్,కలకోటి.యాదగిరి, ముసలయ్య,రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎగ్జాం ప్యాడ్ ల బహుకరణ



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 2,(తరంగాలు** ):జఫర్గడ్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఇదే గ్రామ నివాసి విశ్రాంత ఉపాధ్యాయుడుచిలుకమర్రి వెంకటాచారి బుధవారంఎగ్జాం ప్యాడ్ లను బహుకరించారు.ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుచూ తన కుమారుని పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని ఈ ప్యాడ్ లను బహుకరిస్తున్నట్లు పేర్కొంటూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వస్తే పాఠాలు చక్కగా అర్థమవుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ ప్రధానోపాధ్యాయులు రమేష్ , దుస్స లక్ష్మణ్ , డీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ , విద్యాభిమానులు జ్యోతి రవి,కన్న సోమశేఖర్ ,తాటికాయల యాకయ్య, అజీత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పాలన పూర్తి

•ప్రతి మండల కేంద్రంలో ప్రెస్ మీట్ లు పెట్టాలి,సంబరాలు నిర్వహించాలి

•జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ,అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా పరిపాలిస్తున్న మన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని పిలుపునిస్తున్నాము. ఈ సందర్భంగా నేడు సెప్టెంబర్ 03-2026 న అన్ని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ లు నిర్వహించి, గత 1000 రోజులలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి,అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరుతున్నాము.అదేవిధంగా మీ మీ మండల, పట్టణ కేంద్రాలలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి,మిఠాయిలు పంచి ఈ వేడుకను ఘనంగా జరపాలని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను పత్రికా ముఖంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు.

# మండల ఎస్ జి ఎఫ్ క్రీడలు ప్రారంభం





**జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 2,(తరంగాలు)**: పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూనూరు యందు జఫర్గడ్ మండల స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, డఅండర్ 17 సంవత్సరముల బాలబాలికల ఎంపిక పోటీలు ప్రారంభమైనవి.ప్రారంభోత్సవ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ పర్వాజ్ అధ్యక్షత వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి ఎస్ జి ఎఫ్ ఐ అధ్యక్షులు మంగు జయప్రకాష్. అనంతరం ఎస్ జి ఎఫ్ పతాకావిష్కరణ , జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో అభివృద్ధి సాధించిన వారు చదువుల్లో కూడా అభివృద్ధి సాధించగలరని క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు.కానీ చదువుల్లో అభివృద్ధి సాధించిన వారు క్రీడల్లో అభివృద్ధిని సాధించడం అంత సులభం కాదని" కనుక ప్రతి విద్యార్థి గెలుపు ఓటముల కంటే క్రీడల్లో పాల్గొనడంపై దృష్టి సారించాలని విద్యార్థులను ఉద్దేశించి బోధించారు. క్రీడల ద్వారా ఆరోగ్యం ఆనందం రిజర్వేషన్ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వారు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వాజ్ మాట్లాడుతూ మండల ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయికుమార్ పిడి కూనూరు ఆర్గనైజింగ్ బాధ్యతలు స్వీకరించడం వల్ల పిల్లలకు న్యాయం జరుగుతుందని,నిజమైన క్రీడాకారులను ఎంపిక చేయాలని జిల్లా స్థాయిలో జఫర్గడ్ మండలాన్ని అగ్రమిగా నిలవాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయులను కోరారు.మండలంలోని కూనూరు, హిమ్మత్ నగర్, తమ్మడపల్లి (జి) తిడుగు, తిమ్మంపేట, మోడల్ స్కూల్,కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, పాఠశాలల నుండి దాదాపు 200కు పైగా బాలికలు హాజరైనారు కబడ్డీ కోకో వాలీబాల్ క్రీడలు ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల సాయికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గువ్వల గూడెం హెడ్మాస్టర్ పిట్టల మహేందర్,సీనియర్ స్కూల్ అసిస్టెంట్, రామమూర్తి, స్టాఫ్ సెక్రటరీ రమేష్ బాబు, సోషల్ వర్కర్ డాక్టర్ పల్లె రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ వంశీకృష్ణ,హరిత, శ్రీధర్,మహాలక్ష్మి, గోపు నరేష్, రాజు, శ్రీనాథ్,శ్రీలత,వాలీబాల్ కోచ్ యోగ ఇన్స్ట్రక్టర్ చందా సాంబరాజు, ఉపాధ్యాయ బృందం, క్రీడాభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నట్లు హెడ్మాస్టర్ పర్వాజ్ తెలిపారు.బుధవారం మొదటి రోజు బాలికల విభాగంలో సీనియర్ మరియు జూనియర్ ఎంపికలు నిర్వహించారు.గురువారం రోజున బాలురకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# 155 కోట్లతో ఆధునిక మార్కెట్ అభివృద్ధి

•రైతులకు అన్ని సౌకర్యాలు

•మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 155 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తెలిపారు. గతంలో మార్కెట్‌లో చిన్నచిన్న షెడ్లు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా 2017లో భారీగా మిర్చి బస్తాలు రావడంతో మార్కెట్ పరిసర రహదారులపై కూడా బస్తాలను నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా 2 లక్షల బస్తాలకు పైగా వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నూతన మార్కెట్‌ను రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. మార్కెట్ ఆధునికీకరణలో ముఖ్యాంశాలు

?155 కోట్లతో నూతన మార్కెట్ అభివృద్ధి

మొత్తం 15 ఎకరాల 20 కుంటల విస్తీర్ణంలో మార్కెట్ నిర్మాణం

దాదాపు 7 ఆధునిక షెడ్ల నిర్మాణం ఒక్కో షెడ్ సుమారు 90 అడుగుల వెడల్పు -- 400 అడుగుల పొడవు

ఏడో షెడ్డులో మెజనైన్ ఫ్లోర్ ఏర్పాటు

రైతుల కోసం విశ్రాంతి భవనం

ట్రేడర్లు, ఆడతీ వ్యాపారులు, గుమాస్తాలు, హమాలీలు, దడవాయిల కోసం ప్రత్యేక గదులు

షెడ్ల మధ్య 80 అడుగుల వెడల్పుతో రహదారులు

4 మినరల్ వాటర్ ప్లాంట్లు

ఆధునిక సౌకర్యాలతో 3 టాయిలెట్ బ్లాక్‌లు, మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా

వర్షపు నీరు పూర్తిగా బయటకు వెళ్లేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ

ప్రతి షెడ్డులో ఆధునిక ఎల్ఈడి లైటింగ్

భద్రత కోసం 120 అధునాతన సీసీటీవీ కెమెరాలు 12 అడుగుల ఎత్తైన ప్రహరీ గోడ

90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంప్

డొమెస్టిక్ అవసరాలతో పాటు ఫైర్ ఫైటింగ్ సిస్టమ్

మొత్తం 7 షెడ్లకు అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ నాణ్యత విషయంలో రాజీ లేదు మార్కెట్ నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని హనుమంతరావు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు నాబార్డ్‌కు చెందిన నాస్కాన్ వంటి కన్సల్టెన్సీ సంస్థను నియమించడంతో పాటు ఏడుగురు ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని తెలిపారు.ఇటీవల సుమారు 6 లక్షల మొక్కజొన్న బస్తాలను నిల్వ చేసిన సందర్భంలో 70--80 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ వాహనాలు వచ్చినప్పటికీ రోడ్లకు ఎలాంటి నష్టం జరగలేదని, నిర్మాణ నాణ్యతకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.

మార్కెట్ చుట్టుపక్కల మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు మార్కెట్ చుట్టూ నాలుగు వైపులా సీసీ రోడ్ల నిర్మాణానికి ?1,57,20,940, డ్రైనేజీ నిర్మాణానికి ?66,95,058 కేటాయించినట్లు తెలిపారు.

అలాగే తూర్పు వైపున ఉన్న పాత ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ?25,91,139 మంజూరైనట్లు వెల్లడించారు. అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం మార్కెట్ విస్తరణలో భాగంగా పశ్చిమ వైపు ఉన్న 39 మంది నిరుపేదల గుడిసెలను తొలగించినప్పటికీ, వారికి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించిన తర్వాతే తరలింపు చేపట్టామని తెలిపారు.ఇప్పటికే 26 కుటుంబాలకు అల్లిపురం వద్ద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

మిగిలిన 13 కుటుంబాలకు పట్టాలు మంజూరు

త్వరలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పట్టాల పంపిణీ

అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నదే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యమని హనుమంతరావు పేర్కొన్నారు.విమర్శలు చేసే ముందు మార్కెట్‌ను పరిశీలించాలి మార్కెట్ నిర్మాణంపై విమర్శలు చేస్తున్న వారు ముందుగా మార్కెట్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి,ఆధునిక సాంకేతికత, నిర్మాణ నాణ్యతను పరిశీలించాలని హనుమంతరావు సూచించారు.ఎవరో చెప్పిన మాటలు విని విమర్శలు చేయడం కాకుండా, స్వయంగా మార్కెట్‌ను సందర్శించి వాస్తవాలను తెలుసుకోవాలి. అభివృద్ధిలో లోపాలు ఉంటే సద్విమర్శలు, సూచనలు చేయండి. వాటిని స్వీకరించి మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు మేము సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు ఇప్పటికే రాష్ట్రంలోని సుమారు 20--25 మార్కెట్ కమిటీల చైర్మన్లు,పాలకవర్గ సభ్యులు ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి,ఇక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను ప్రశంసించారని తెలిపారు.ఇతర మార్కెట్లలో కూడా ఇలాంటి ఆధునిక సౌకర్యాలు కల్పించాలని తమ ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందిస్తామని వారు పేర్కొన్నట్లు హనుమంతరావు తెలిపారు.ఖమ్మం జిల్లా రైతులకు ఆధునిక మార్కెట్ సదుపాయాలు అందించాలనే దూరదృష్టితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధిని రాజకీయ కోణంలో చూడకుండా, రైతుల ప్రయోజనాల దృష్టితో స్వాగతించాలి. అందరి సలహాలు, సూచనలను స్వీకరించి మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు పేర్కొన్నారు.

## సంకల్ప సాధకుడు పవన్

### తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సం దర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజా ప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు.

## కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భం గా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం లో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించను న్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కి స్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.

# వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





**నల్గొండ- సెప్టెంబర్2,తరంగాలు :** ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందరూ కలిసిమెలిసి ఈ సంవత్సరపు వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చ బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో గతంలో అన్ని రకాల ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడం జరిగిందని, అదే మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని కోరారు. గత సంవత్సరం ఎదురైన సమస్యలు తిరిగి ఉత్పన్నం కాకుండా చూడాలని, ప్రత్యేకించి వినాయక నిమజ్జనం చేసే చోట అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం వల్ల చెరువులు, కుంటలు, కాలువలలో నీరులేనందున ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఈ విషయాన్ని వినాయక విగ్రహాలు ప్రతిష్టాపించే వారికి ,ప్రజలకు ముందుగానే తెలియజేయాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు నిర్వహించాలని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసినట్లుగానే, డివిజన్ స్థాయిలో కూడా ఆర్డీవోలు, డిఎస్పీలు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని చెరువులు ,కుంటల వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేయాలని ,ఎక్కడైనా నీరు సమృద్ధిగా లేనట్లయితే ఇరిగేషన్ అధికారులు విగ్రహాలు పూర్తిగా మునిగేలా గుంతలు తవ్వి నీరు నిలువ ఉండేలా చేసి నిమజ్జనానికి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వినాయక విగ్రహాన్ని పోలీసు అధికారులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు కూడా ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు సహకారమందించాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు విగ్రహాలు ఎక్కువ ఎత్తు లేకుండా చూడాలని, నల్గొండ పట్టణంతో పాటు, ఇతర చోట్ల విగ్రహాలకు కేబుల్ సమస్యలు వస్తున్నాయని, సమస్యలు రాకుండా, అలాగే తక్కువ ఎత్తులో వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని అన్నారు. ప్రతి మండపానికి విద్యుత్ శాఖ ద్వారా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, తాగునీటికి ఉపయోగించే పానగల్ వంటి చెరువులో విగ్రహాల నిమజ్జనం చేయకుండా వల్లభరావు చెరువుకు తీసుకెళ్లేలా చూడాలన్నారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా పండాల్స్ ఏర్పాటు చేసినప్పటి నుండి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి కమిటీ సభ్యులు, అలాగే పండాల్ నిర్వాహకులు పోలీసుల తో సహకరించాలని కోరారు. ప్రతి వినాయక మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి వినాయక విగ్రహాన్ని పోలీసు తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించడంలో శాంతి కమిటీ ముఖ్య పాత్ర పోషించాలని, మండపాల వద్ద డీజే ల ఏర్పాటుకు వీలులేదని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైకులు వినియోగించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. వినాయక విగ్రహాలు నమోదు చేసుకునేందుకు పోలీస్ తరపున పోర్టల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో నిమజ్జనం వివరాలు, పండాల్ నిర్వహణ, తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. నల్గొండ పట్టణంలో కిందికి వేలాడే విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లను ముందే సరి చేయాలని, డిఎస్పీలు డివిజన్, మండల్ వారిగా నీటి లభ్యత అందుబాటును దృష్టిలో ఉంచుకొని ఆర్డీవోలతో కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

నల్గొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను సవ్యంగా నిర్వహించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని, శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విగ్రహాలు ఏర్పాటుచేసిన చోట డస్ట్ బిన్ ఏర్పాటుతో పాటు ,బ్లీచింగ్ పౌడర్, పరిశుభ్రత కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు అందరు సహకరించాలన్నారు .

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆఫీజ్ ఖాన్ మాట్లాడుతూ పండగలు ఏ ఒక్క మతానికి సంబంధించినవి కాదని, అందువల్ల అందరూ కలిసిమెలిసి వినాయక ఉత్సవాలను సవ్యంగా , శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేలా సహకరించాలని కోరారు. వినాయక ఉత్సవాల నిర్వహణకు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుండి కాకుండా జిల్లా కలెక్టర్ నిధుల నుండి బడ్జెట్ మంజూరు చేయాలని కోరారు. విగ్రహాల నిమజ్జనం, ఊరేగింపులను సమయానుకూలంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు .

స్థానిక సంస్థల ఇన్చార్జ్ కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలు స్థాపించేలా ప్రోత్సహించాలని, వ్యక్తిగతంగా కాకుండా గ్రూపులుగా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

శాంతి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల నీటి సమస్య ఉన్నందున నిమజ్జనం చేసే ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ప్రతి సంవత్సరం విగ్రహాల సంఖ్య పెరుగుతున్నందున నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అలాగే పర్యావరణ పరిరక్షణ పై కూడా దృష్టి సారించాలని కోరారు. సాగర్ కాలువకు నీరు వదిలేలా చూడాలని జిల్లా కలెక్టర్ తో విజ్ఞప్తి చేశారు. ప్రతి డివిజన్, మండలాలలో కూడా శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, వినాయక ఉత్సవాలు నిర్వహించే రోజులు శానిటేషన్ నిర్వహించాలని, కేబుల్ వైర్లు, తక్కువ ఎత్తులో ఉండే ఎలక్ట్రిక్ వైర్లను సరిచేయాలని, శివారు ప్రాంతాలలో కూడా లైటింగ్, రోడ్లపై దృష్టి సారించాలని, చర్లపల్లి సమీపంలోని భీమ సముద్రంలో కూడా వినాయక నిమజ్జనానికి చర్యలు తీసుకోవాలని, పోలీసు ద్వారా ప్రత్యేకించి పీస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, గ్రామాలలో కూడా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నందున అక్కడ కూడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, రహదారుల మరమ్మతులు చేపట్టాలని, మంచినీటి చెరువుల్లో వినాయక నిమజ్జనం జరగకుండా చూడాలని, ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రతిరోజు శానిటేషన్ నిర్వహించేలా చూడాలని, 19 లేదా 20 తేదీలో నల్గొండ పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని, గతంలో నిర్వహించినట్లుగానే ఈ సంవత్సరం కూడా వినాయక ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

డిఆర్ఓ దశరథ్ ,ఆర్డీవోలు వై.అశోక్ రెడ్డి ,రమణారెడ్డి, శ్రీదేవి, అడిషనల్ ఎస్పీ రమేష్, డిఎస్పీలు ఈ సమావేశానికి హాజరుకాగా, శాంతి కమిటీ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, వీర్ల చంద్రశేఖర్, గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, బిఆర్ఎస్ పార్టీ నుండి పిచ్చయ్య, సిపిఎం నుండి మహమ్మద్ సలీం, పశువుల సౌరయ్య, ఎండి హాలీం, సిపిఐ నుండి హసన్, ఎడ్ల శ్రీనివాస్, పాస్టర్ క్రిస్టఫర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు మాట్లాడారు. జారీ చేసిన వారు సహాయ సంచాలకులు ,సమాచార శాఖ నల్గొండ.

## బిజెపి దుర్మార్గపు చర్యలను ఖండించాలి

- నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు
- గుజ్జర్లపూడి రాంబాబు మేకల మల్లిబాబు యాదవ్, షేక్ పతే మహమ్మద్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** రాజకీయంగా ఎదుర్కోలేక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ దురుద్దేశపూర్వకంగా రాహుల్ గాంధీ పై కేసులు పెట్టిన, మతోన్మాద బీజేపీ దుశ్చర్యలను ఎండగట్టాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో రాహుల్ గాంధీ పై బిజెపి నాయకులు వేసిన అక్రమ కేసుకు నిరసనగా మంగళవారం నాడు కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్ లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్ తదితరులు పాల్గొని ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ఫాసిస్ట్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలకు ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని, దళిత ముద్దుబిడ్డ, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూర్చున్న స్థలాన్ని శుద్ధి చేసి అవమాన పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నందుకు, బిజెపి గ్రాఫ్ ఎక్కడ పడిపోతుందో అనే భయం చేత భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు ధోరణితో తిరిగి రివర్స్ లో కేసు పెట్టడం జరిగిందని, ఈ విషయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశం యా వత్తు సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చిందని, అంతేకాకుండా ఇటీవల నీటు విద్యార్థుల పరీక్షలలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం జరిగితే వారిపై తుపాకీ కాల్పులు జరపడం జరిగిందని,
అడవులను,ఖనిజాలను, పెట్టుబడిదారీ వ్యవస్థకు దుర్మార్గంగా అప్పగించాలని దురుద్దేశంతో, అడవులపై కన్నేసి, అడవుల ఆక్రమణకు అడ్డంగా ఉంటున్నారని నివసిస్తున్న గిరిజనులను నిర్దాక్షిణ్యంగా తరిమికొట్టి, వారికి అండగా ఉంటున్న నక్సలైట్లను బూటకపు
ఎన్ కౌంటర్ చేసి కాల్చివేసిన ఘనత బిజెపి పార్టీకి దక్కిందని, హిందుత్వం పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో తరతరాలుగా నివసిస్తున్న వారి ఓట్లను కూడా తొలగించి న బిజెపి పాశవిక చర్యలను తిప్పి కొట్టాలని, రాహుల్ గాంధీ పై పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును తిరిగి వాపస్ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్లపల్లి శేషగిరిరావు, కాట్రాల వీరబాబు, పింజర మడుగు సర్పంచ్ గుగులోతు భాష,కొమ్మినేపల్లి ఉప సర్పంచ్ మేకల మల్లిఖార్జున రావు,సత్తి వీరబాబు, పండగ కోటి, కమటం వెంకటేశ్వర్లు, చెరుకుమల్ల బుచ్చయ్య, ఎరకల రమేష్,ఆలోత్ శివ, రాము,మంగ్యా జీ నాయక్, బద్రు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాల శాఖ అధ్యక్షులు, సర్పంచులు ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మల్లె పల్లి లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 2 తరంగాలు**

వలిగొండ మండల పరిధిలోనిగ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మల్లెపెళ్ళిలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన డ్రైనేజి, రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభం, రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపి రెడ్డి,పి ఏ సి ఎస్ చైర్మన్ గరిసె రవి,మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహాదేవ్ గౌడ్,ఉప సర్పంచ్ మలుగ మాధవి--వెంకటేష్,పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ జంగా రెడ్డి,డైరెక్టర్లు,వార్డు నెంబర్లు నాయకులు వాకిటి అనంతరెడ్డి,బద్దం సంజీవరెడ్డి,రైస్ బుచ్చిరెడ్డి,సామ రాంరెడ్డి, కాసుల వెంకన్న, పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా సంఘం మహిళలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.




# భువనగిరి లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పై బీజేపీ దాడి హేయమైన చర్య - ఎమ్మెల్యే కుంభం

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 2 తరంగాలు**

భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై నిన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు బుధవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేయడం హేయమైన చర్య.. ఇది రాజకీయం కాదు.. ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేయాలని, ప్రత్యర్థులపై నిర్మాణాత్మక విమర్శలు చేయాలి తప్ప దాడులు, హింసకు పాల్పడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదని అన్నారు. మారణాయుధాలతో క్యాంప్ కార్యాలయంపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా వేదిక అని, భువనగిరిలో ఇలాంటి దాడుల సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు.

బీజేపీపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు

ఢిల్లీ నుంచి అమిత్ షా డైరెక్షన్‌లో బండి సంజయ్ మరియు బీజేపీ నాయకులు గుండా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇన్ని రోజులు మేము సంయమనం పాటించాం.. మా ఓపికను బలహీనతగా భావించొద్దు. హద్దులు దాటితే ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే గట్టిగా సమాధానం చెబుతాం అని హెచ్చరించారు. ఇటీవల నల్గొండలో మంత్రి ఇంటిపై జరిగిన దాడిని కూడా ప్రస్తావిస్తూ, బీజేపీ హింసాత్మక రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. చెప్పేది రాముడి పేరు.. చేసేది రావణకాండ అన్న రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. నిన్నటి ఘటన అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించారని, ఈరోజు క్యాంప్ కార్యాలయాన్ని గోపంచకంతో శుద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హింసకు ఎప్పటికీ తలొగ్గదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలుబీఆర్ఎస్‌పై కూడా ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణలో 1000 రోజుల దగా అంటూ బీఆర్ఎస్ మరో కొత్త రాజకీయ నాటకానికి తెరతీసిందని అన్నారు. ప్రజలను తప్పుదోవ



పట్టించే అబద్ధాలు, అసత్య ప్రచారాలను మానుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన వైఫల్యాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని,ప్రజా సమస్యలపై చర్చించకుండా రాజకీయ నాటకాలు చేయడం సరికాదన్నారు.

కేసీఆర్ ఒక్కరోజు కూడా అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజా సమస్యలకు దూరంగా ఉండటం సరికాదని విమర్శించారు. ప్రజల కోసం పని చేయని కేసీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాలకు అడ్రస్ అంటేనే బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే హింస, దాడులు, బెదిరింపులను మాత్రం సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి--రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పట్టణ కౌన్సిలర్లు, జూఖిఎం చైర్మన్లు, డైరెక్టర్స్,పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, డీసీసీ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 03 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఘనంగా స్వర్గీయ వై ఎస్ ఆర్ వర్ధంతి వేడుకలు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 2 తరంగాలు**
వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి సందర్భముగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కుంభం వెంకట పాపి రెడ్డి,భీమా నాయక్,గరిసే రవి,బత్తిని సహదేవ,వెంకటేష్, జంగారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువకులు, తదితరులు
పాల్గొన్నారు.

## రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

- జిల్లా పరిపాలన అధికారికి వినతి పత్రం..
- కర్ణకంటి కమలమ్మ యాదయ్య
- సర్పంచ్ వెంకటాపురం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 2తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి ని నియమించాలని కోరుతూ సర్పంచ్ కర్ణ కంటి కమలమ్మ యాదయ్య జిల్లా పరిపాలన అధికారి అంజిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నాయని రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఇంచార్జి కార్యదర్శి రెండు గ్రామాలకు బాధ్యత వహిస్తూ సరైన సమయాన్ని కేటాయించకపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వెంటనే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని వారు కోరారు.అదేవిధంగా గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని కోరారు గ్రామంలో స్మశాన వాటిక వరకు,ఆరూరు వేములకొండ రోడ్డు నుండి మత్స్యగిరి గుట్ట వరకు సిసి రోడ్డును నిర్మించాలని,మత్స్యగిరి గుట్ట పైన శిథిల వ్యవస్థలో ఉన్న వాటర్ ట్యాంకు స్థానంలో నూతన వాటర్ ట్యాంక్ ను నిర్మాణం చేయాలని, గ్రామంలో నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని కోరారు. మిగతా గ్రామాలకు అభివృద్ధి కోసం నిధులను కేటాయిస్తున్న ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల సర్పంచ్ లు ఉన్న గ్రామాలకు నిధులను ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వెంటనే గ్రామ సమస్యల పరిష్కారం కోసం నిధులను కేటాయించాలని కోరారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఇమ్మానుయెల్ రాజ్



**స్టేషన్ ఘన్పూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 2,(తరంగాలు)**: స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ లో ఒకటవ వార్డుకు చెందిన జీడి చంద్రవ్వ ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ సింగపురం ఇందిర కుమారుడు సింగపురం ఇమ్మానుయేల్ రాజువారితోపాటు జనగాం జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ సింగపురం నాగయ్య, జనగాం జిల్లా కార్యదర్శి చాగంటి మణి,జిల్లా కార్యదర్శి తాడికొండ సంపత్ యాదవ్,చిల్పూర్ మండల్ బీసీ సెల్ అధ్యక్షులు బాలరాజు,స్టేషన్ఘన్పూర్ మాజీ ఉపసర్పంచ్ సింగపురం వెంకటయ్య,స్టేషన్ఘన్పూర్ సీనియర్ నాయకులు చింత ఎల్లయ్య ,స్టేషన్ఘన్పూర్ మార్కెట్ డైరెక్టర్ వసంత్,జనగాం జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఏలియా, సీనియర్ నాయకులు రాజశేఖర్,.రాజు కుమార్. రాంబాబు,సునీల్,రాజు, సింగపురం ప్రతుష్, నియోజకవర్గ నాయకులు పరామర్శించారు

# ప్రజా సంక్షేమం మరిచిన పాలకులు





- అమలు కానీ హామీలు ఇచ్చి నయవంచన..
- తక్షణమే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి..
- సెప్టెంబర్ 10 తర్వాత కార్యాచరణ ఉధృతం
- రైతులను ఏడిపిస్తే చూస్తూ ఊరుకోం
- హామీల అమలు కోరుతూ పాలేరు రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

**పాలేరు ఆర్సీ,సెప్టెంబర్ 01(తరంగాలు) :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కందాల మాట్లాడుతూ..ఎన్నికల్లో 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ, 1000 రోజులైనా ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు కేవలం ఓట్ల కోసం వేసిన నాటకాలని తేలిపోయిందన్నారు. ?క్షేత్రస్థాయిలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.?ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో పాలేరు గడ్డపై నుంచి ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు వేల్పుల వీరయ్య, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షుడు బాసిబోయిన వీరన్న, నేలకొండపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బ్రాహ్మయ్య, నియోజకవర్గం లోని బీఆర్ఎస్ సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

- గొస్సగుప్ప ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఘటనపై సమీక్ష
- మలేరియా కేసుల్లో రక్తపు స్మియర్ పరీక్షలు తప్పనిసరి: డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్



**భద్రాచలం, జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 2:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏటపాక మండలం గొస్సగుప్ప గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహంలో జ్వర కేసులు నమోదైన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ బుధవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహానికి చెందిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.మలేరియా నివారణ చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ వైద్య శిబిర సిబ్బంది విద్యార్థులకు క్లోరోక్విన్ మాత్రలు అందించిన అనంతరం మొత్తం 52 మంది వసతి గృహ విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. వీరిలో 9 మందికి మాత్రలు తీసుకున్న అనంతరం దుష్ప్రభావాలు, ఆందోళన లక్షణాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. జమున అనే విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకురాగా, అప్పటికే మృతిచెందిన స్థితిలో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.మిగిలిన విద్యార్థులకు ఆసుపత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన చికిత్స అందిస్తోంది. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### మలేరియా పరీక్షలపై ప్రత్యేక దృష్టి

అనంతరం డీఎంహెచ్ఓ ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఎంపీహెచ్డబ్ల్యూ/ఎంటీలు, సబ్‌యూనిట్ అధికారులు (ఎస్‌యూవోలు), ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ, చికిత్సా విధానాలపై సమావేశంలో చర్చించారు.
రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ (=ఱ)లో మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణైన ప్రతి కేసులో తప్పనిసరిగా బ్లడ్ స్మియర్ (దీూ) నమూనాలను సేకరించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. నిబంధనల ప్రకారం జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రయోగశాలలకు నమూనాలను పంపించి క్రాస్ వెరిఫికేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు.

### పోషకాహారంపై అవగాహన కల్పించాలి

పోషకాహార వారోత్సవాల రెండో రోజు సందర్భంగా సమతుల్య, పోషక విలువలతో కూడిన ఆహారం ప్రాధాన్యతను డీఎంహెచ్ఓ వివరించారు. శరీరానికి అవసరమైన పోషకాలను తగిన మోతాదులో తీసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.

### నేత్రదానంపై విస్తృత ప్రచారం

ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమాలపై కూడా సమీక్ష నిర్వహించారు. నేత్రదానం ప్రాధాన్యత, దాని ద్వారా చూపు కోల్పోయిన వారికి కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజల్లో ఆరోగ్యంపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ సూచించారు.ఈ సమీక్షలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (గిరిజన) డాక్టర్ సైదులు, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీధర్ (భద్రాచలం), జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్‌యూనిట్ అధికారులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కళ బృందాలచే అవగాహన సదస్సు

**సంగెం సెప్టెంబర్ 02 తరంగాలు**
జాగృతి పోలీస్ కళా బృందం, వరంగల్ నగర పోలీస్ కమీషనర్ ఎన్ శ్వేత ఐపీస్ ఆదేశాల మేరకు రాత్రి 6:45 గంటల నుంచి 9:30 గంటల వరకు సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపులకనిపర్తి గ్రామంలో సంగెం ఎస్ ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చాల మంది యువకులు గంజాయి డ్రగ్స్,గుట్కా మత్తు పదార్థాల బారిన పడవద్దని,గంజాయి అమ్మిన సేవించిన 1908 టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారశీ అందిస్తామని చెప్తు, కళా బృందం సభ్యులు చదువుపై, మరియు రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, డయల్ 112, సీసీటీవీ కెమెరాలు, వృద్ధాప్యంలో వున్న తల్లితండ్రులను మంచిగ చూసుకోవాలని, అలాగే మూడ నమ్మకాలపై మ్యాజిక్ షో తదితర సామాజిక అంశాలపై పాటల ద్వార వివరిస్తూ, మరియు సైబర్ క్రైమ్స్ నాటిక ద్వార ప్రదర్శన చేస్తు 1930 సైబర్ హెల్ప్ లైన్ నంబర్ గురించి చెప్పినాము



ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చంద్రమౌళి కానిస్టేబుల్ ఆఫీసర్స్ శంకర్, అమీర్, కమేరుద్దీన్ మరియు కళాబృందం ఇంచార్జీ వుమెన్ ఏ ఎస్ ఐ నాగమణి ,సభ్యులు హెడ్ కానిస్టేబుల్స్ విలియం, వెంకటేశ్వర్లు,రత్నయ్య,పీసీ పూల్ సింగ్,హోంగార్డ్స్ శ్రీనివాస్, నారాయణ,విక్రమ్ రాజు,మరియు గ్రామ ప్రజలు 300 మంది పాల్గొన్నారు.

# కూసుమంచి గిరిజన హాస్టల్‌లో ఏం జరుగుతోంది..



**విద్యార్థులకు చికెన్‌లో కోత.. = వార్డెన్ విధులకు గైర్హాజరు?**

**పర్యవేక్షణ లోపంపై అధికారుల దృష్టి సారించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు.**

**ఖమ్మం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 2**
గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న కూసుమంచి ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలు, ఆహార నాణ్యతపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాల్సిన చికెన్ పరిమాణం కంటే తక్కువగా అందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం లేదని పలు విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కూసుమంచి గిరిజన వసతి గృహాన్ని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యనారాయణ బుధవారం వసతి గృహాన్ని సందర్శించారు. 130 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్లో సుమారు 6 కిలోల లోపు ఉన్న చికెన్ మాత్రమే అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇలా చిన్న పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించకుండా ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని అన్నారు.






**= విధులకు వార్డెన్ సక్రమంగా హాజరవుతున్నారా?!!**

హాస్టల్ నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన వార్డెన్, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వార్డెన్ అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థుల సమస్యలను పట్టించుకునే వారు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

**పర్యవేక్షణ ఎక్కడ?..**

హాస్టల్ నిర్వహణను సంబంధిత డివిజన్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం కనిపిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. హాస్టల్‌లో ఆహారం, విద్యార్థుల హాజరు, సిబ్బంది విధులు, వసతి సౌకర్యాలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**హాస్టల్‌లో బయటి వ్యక్తుల సంచారం**

ఇదిలా ఉండగా, హాస్టల్ పరిసరాల్లో బయటి వ్యక్తులు, ముఖ్యంగా కొంతమంది మహిళలు వచ్చి ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. హాస్టల్ ప్రాంగణంలో అనధికార వ్యక్తుల ప్రవేశానికి అనుమతి ఉందా? ఉంటే... ఏ నిబంధనల ప్రకారం అనుమతిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారులు విచారణ చేయాలి.**

విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదా? చికెన్ తదితర ఆహార పదార్థాల కొనుగోలు, వినియోగానికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయా? వార్డెన్ హాజరు రిజిస్టర్ ఎలా ఉంది? హాస్టల్‌లో బయటి వ్యక్తులు ఎందుకు ఉంటున్నారు? అనే అంశాలపై గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలోనూ సదరు వార్డెన్‌పై ఆరోపణలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో... వాటిపై కూడా అధికారికంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# 99 శాతం మంది పీలుస్తున్నది కాలుష్యపు గాలినే అధ్యయనంలో వెల్లడి



వాయు కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా గాలిలోని అత్యంత సూక్ష్మమైన కాలుష్య కణాలు శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపడంతో పాటు క్యాన్సర్ ముప్పును కూడా పెంచుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ జనాభాలో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాలను మించిన కాలుష్యానికి గురవుతున్నట్లు పరిశోధకులు తెలిపారు. 2000 నుంచి 2020 మధ్య కాలంలో ప్రపంచంలోని 952 ప్రాంతాల్లో నమోదైన క్యాన్సర్ భారాన్ని, సాధారణ వాయు కాలుష్య కారకాలకు దీర్ఘకాలికంగా గురికావడంతో ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేశారు. మొత్తం 10.9 కోట్ల క్యాన్సర్ కేసులను పరిశీలించిన ఈ పరిశోధనలో పీఎం2.5 ప్రధాన పాత్ర పోషిస్తున్న కాలుష్య కారకంగా గుర్తించారు. ఈ అధ్యయన ఫలితాలు నేచర్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

**పెరిగిన క్యాన్సర్ ముప్పు..**

2.5 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన సూక్ష్మ కణాలను పీఎం2.5గా పిలుస్తారు. ఇవి చాలా చిన్నగా ఉండటంతో శ్వాస ద్వారా శరీరంలోకి సులభంగా ప్రవేశిస్తాయి. అధ్యయనం ప్రకారం 2000–2020 మధ్య నమోదైన మొత్తం క్యాన్సర్ కేసుల్లో సుమారు 88.2 లక్షల కేసులకు పీఎం2.5 కాలుష్యం కారణమై ఉంటుందని అంచనా వేశారు. ప్రతి క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం2.5 స్థాయి 10 మైక్రోగ్రాములు పెరిగినప్పుడు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 17.9 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. అదే స్థాయిలో పీఎం2.5కు గురికావడం వల్ల కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం 17.9 శాతం, మూత్రాశయ క్యాన్సర్ ప్రమాదం 21.1 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. పీఎం2.5 ప్రభావం కేవలం శ్వాసకోశ వ్యవస్థకే పరిమితం కాదని పరిశోధకులు తెలిపారు. థైరాయిడ్, అన్నవాహిక, పెద్దపేగు, మలద్వారం, రొమ్ము వంటి ఇతర భాగాలకు సంబంధించిన క్యాన్సర్లతోనూ ఈ కాలుష్యానికి సంబంధం ఉన్నట్లు అధ్యయనం సూచించింది.

**నివారణే ముఖ్యం..**

పీఎం2.5 కాలుష్యం తొలగించగలిగితే లేదా దానికి గురికావడాన్ని గణనీయంగా తగ్గించగలిగితే శ్వాసనాళం, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసుల్లో సుమారు 17.9 శాతం వరకు నివారించవచ్చని అధ్యయనం అంచనా వేసింది. ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు పీఎం2.5 ఒక ప్రధాన కారణమనే విషయాన్ని ఈ ఫలితాలు మరింత బలపరుస్తున్నాయి. అదేవిధంగా, ఇతర వాయు కాలుష్య కారకాల ప్రభావాన్ని కూడా పరిశోధకులు పరిశీలించారు. ప్రతి క్యూబిక్ మీటర్‌కు 10 మైక్రోగ్రాముల చొప్పున పీఎం2.5, ఓజోన్, నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయిలు పెరిగినప్పుడు క్యాన్సర్ ప్రమాదం వరుసగా 16 శాతం, 4.23 శాతం, 11.7 శాతం పెరిగినట్లు గుర్తించారు. 2000 నుంచి 2020 మధ్య నైట్రోజన్ డయాక్సైడ్ కాలుష్యానికి సంబంధించి సుమారు 66.7 లక్షల క్యాన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం అంచనా వేసింది. ఓజోన్ కాలుష్యానికి సంబంధించి సుమారు 26 లక్షల కేసులు ఉన్నట్లు వెల్లడించింది. ఎక్కువ రకాల క్యాన్సర్ల విషయంలో పురుషులతో పోలిస్తే మహిళలు ఈ కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

**తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లోనే అధికం..**


ప్రపంచవ్యాప్తంగా తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో వాయు కాలుష్యానికి గురికావడం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. ప్రపంచ జనాభాలో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన గాలి నాణ్యత మార్గదర్శకాలను మించిన కాలుష్య స్థాయిలను పీలుస్తున్నారని పరిశోధకులు తెలిపారు. పీఎం2.5 కణాలు చాలా చిన్న పరిమాణంలో ఉండటం వల్ల శరీరంలోకి లోతుగా ప్రవేశించి అనేక జీవక్రియలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధకులు వివరించారు. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరగడం, డీఎన్ఏ దెబ్బతినడం, రోగనిరోధక వ్యవస్థ పనితీరులో మార్పులు వంటి ప్రక్రియల ద్వారా ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని తెలిపారు. వాయు కాలుష్యం శరీరంలోని దాదాపు ప్రతి అవయవ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యయనం పేర్కొంది.

# ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి ఎందుకంటే

పర్వత ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లడం ఉత్సాహాన్ని కలిగించే అనుభవమే. అయితే ఎత్తైన ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేయడానికి శారీరకంగా ఫిట్‌గా ఉండటం ఒక్కటే సరిపోదు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, బరువులు ఎత్తడం, మంచి స్టామినా ఉండటం వల్ల శరీరం తక్కువ ఆక్సిజన్ ఉన్న ఎత్తైన ప్రాంతాలకు సులభంగా అలవాటు పడుతుందని చెప్పలేం. అందుకే హై ఆల్టిట్యూడ్ ట్రెక్కింగ్‌కు వెళ్లే ముందు ఆరోగ్య పరిస్థితిని ఒకసారి అంచనా వేయడం ముఖ్యం. ఎత్తు పెరిగే కొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. దీంతో ప్రతి శ్వాసలో శరీరానికి అందే ఆక్సిజన్ పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండెతోపాటు ఇతర అవయవాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా ఎత్తుకు శరీరం సరిగ్గా అలవాటు పడకముందే వేగంగా పైకి ఎక్కితే ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**శరీరం తట్టుకుంటుందా..**

శారీరక ఫిట్‌నెస్, శరీరం ఎత్తైన ప్రాంతాలకు తట్టుకునే సామర్థ్యం రెండూ వేర్వేరు అంశాలు. క్రమం తప్పకుండా పరుగెత్తే వ్యక్తికి కూడా సరైన అక్లైమటైజేషన్ లేకుండా ఎత్తైన ప్రాంతాలకు వెళ్తే అనారోగ్య సమస్యలు వస్తాయి. సాధారణంగా సుమారు 2,450 మీటర్లకు పైగా ఎత్తులో నిద్రించే, ఆ ఎత్తుకు ఇంకా అలవాటు పడని ఎవరికైనా ఆల్టిట్యూడ్ ఇల్‌నెస్ వచ్చే అవకాశం ఉంటుంది. దీనిని ముందుగానే కచ్చితంగా అంచనా వేసే ఒకే ఒక్క సాధారణ పరీక్ష కూడా లేదు. గతంలో ఎత్తైన ప్రాంతాలకు వెళ్లినప్పుడు శరీరం ఎలా స్పందించింది, ఎంత వేగంగా ఎత్తుకు చేరుకుంటున్నారు అనే అంశాలు కూడా ముఖ్యమైన సూచికలుగా ఉంటాయి. అందుకే ట్రెక్కింగ్‌కు ముందు చేసే హెల్త్ చెకప్‌ను కేవలం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గా కాకుండా ఆరోగ్యపరమైన ప్రమాదాలను గుర్తించే ఒక ముందస్తు పరిశీలనగా చూడాలి. వయసు, గత వైద్య చరిత్ర, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ఫిట్‌నెస్ స్థాయి, వెళ్లబోయే ప్రాంతం ఎంత ఎత్తులో ఉంది వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన పరీక్షలను నిర్ణయించాలి.



**ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉన్నాయా..**

ముందుగా ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పరిశీలించడం ముఖ్యం. ముఖ్యంగా ఆస్తమా, దీర్ఘకాలిక దగ్గు, గతంలో క్షయవ్యాధి వచ్చిన చరిత్ర, ధూమపానం అలవాటు, స్లీప్ అప్నియా లేదా కారణం తెలియని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి ఆక్సిజన్ శాచురేషన్ పరీక్షతో పాటు పూర్తి శ్వాసకోశ ఆరోగ్య చరిత్రను పరిశీలించుకోవాలి. కొందరికి స్పైరోమెట్రీ వంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి. ఇన్హేలర్లను క్రమం తప్పకుండా ఉపయోగించే వారు వాటిని సరైన విధంగా ఎలా ఉపయోగించాలో తెలుసుకోవడంతో పాటు, ట్రెక్కింగ్ సమయంలో అవసరమైన మందులను తమ వెంట తీసుకెళ్లాలి. ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణిస్తే ఏం చేయాలనే దానిపై ముందుగానే ఒక ప్రణాళిక కూడా సిద్ధంగా ఉంచుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. రక్తహీనత కూడా ట్రెక్కింగ్‌కు ముందు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశమే. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉంటే శరీరంలోని కణజాలాలకు ఆక్సిజన్‌ను చేరవేసే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో ఎక్కువ శారీరక శ్రమ చేయాల్సి వచ్చినప్పుడు అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత ఆరోగ్య చరిత్రను బట్టి వైద్యులు కంప్లీట్ బ్లడ్ కౌంట్ వంటి పరీక్షలను సూచిస్తూ ఉంటారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 03 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి: గన్నారపు రమేష్



**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 2 (తరంగాలు)**: వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.
వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో గన్నారపు రమేష్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. గత 19 సంవత్సరాలుగా కనీస వేతనాలను సవరించకపోవడం వల్ల శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల గురించి గొప్పగా చెబుతున్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస కార్మిక చట్టాలు, హక్కులు అమలు కావడం లేదని రమేష్ ఆరోపించారు. పండుగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్థిక సెలవులు వంటి హక్కులు కూడా నేటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు.ఔట్‌సోర్సింగ్ విధానం 2004 సంవత్సరం నుంచి కొనసాగుతున్నప్పటికీ, ఇప్పటికీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన ప్రాథమిక వేతనం అందడం లేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగి బేసిక్ వేతనం ఇవ్వాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా తక్కువ వేతనాలు నిర్ణయించడం అన్యాయమని విమర్శించారు.వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం, ఒత్తిళ్లకు గురిచేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి, కాంట్రాక్ట్ కార్మికులను ఔట్‌సోర్సింగ్ విధానం నుంచి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.అనంతరం ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సెప్టెంబర్ 6న నిర్వహించనున్న బహిరంగ సభను కార్మికులు విజయవంతం చేయాలని గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలకుట్ల రాజు, సంధ్యారాణి, రాష్ట్ర సమితి సభ్యులు లావణ్యతో పాటు ఆసుపత్రి కార్మికులు దడిగెల లక్ష్మణ్, కొల్లిపాక స్వాతి, కొండేటి దిలీప్, కొండేటి దీవెన, సిద్ధం రాణి, జనగాం రమేష్, కొలిపాక శైలజ, శిధిరాల దివ్య, చందు, వైష్ణవి, పున్నం రాజు, పైన చంద్రయ్య, సుర రాధిక, వశుపాఖ మార్త, కొండేటి వినోద, మునికుంట్ల మౌనిక, జంపాల భాగ్య, ఏద్దు హేమంత్‌నాథ్, కన్నం రాజలక్ష్మి, కొండేటి అనిత, సట్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 2,తరంగాలు** : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథిగా హాజరై పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు.కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం నిర్వాహకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మరియు ముదిరాజ్ సంఘం నాయకులు భయ్యా స్వామి, బీజేపీ నాయకులు రత్నం కృష్ణ కిషోర్, జూలూరి నైనేష్, గొడిశాల కార్తీక్ గౌడ్ మరియు కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ అవార్డుల ప్రదానోత్సవం





- అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపిన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (తరంగాలు ప్రతినిధి ):** దేశ రాజధాని ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవార్డ్స్‌లో భాగంగా ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. వారి సమక్షంలో ప్రతిభావంతులకు ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ అవార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవడంతో పాటు, వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించడం ఎంతో ముఖ్యమని పలువురు నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీని అణచివేయాలనుకోవడం కాంగ్రెస్ తరం కాదు





- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- బీజేపీ నేతలపై దాడుల వెనుక ఎవరు? సమగ్ర దర్యాప్తు చేయాలి
- ప్రజా వ్యతిరేకతను దాడులతో కప్పిపుచ్చలేరు
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ


**వరంగల్, సెప్టెంబర్ 2 (తరంగాలు)**:బీజేపీని అణచివేయాలనుకోవడం కాంగ్రెస్ తరం కాదు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు.బీజేపీ కార్యాలయాలతో పాటు ఇటీవల నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి నివాసంపై జరిగిన దాడులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు. అనంతరం పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల పాలన పూర్తయినా రాష్ట్రంలోని ఏ వర్గం కూడా సంతృప్తి చెందలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని ఆరోపించారు. రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలు, వృద్ధులకు సంబంధించిన పెన్షన్ల విషయంలో ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చలేకపోయిందని అన్నారు.
ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాల్సిన ప్రభుత్వం, దాడులకు పాల్పడే పరిస్థితి తెలంగాణ చరిత్రలో భవిష్యత్‌లో కూడా ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందని అన్నారు. బీజేపీ కార్యాలయాలు, నాయకులపై జరిగిన దాడులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భకం హరిశంకర్, జిల్లా కార్యదర్శి పానుగంటి వెంకట, రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు మహేందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కూచన క్రాంతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు రేణుక, ప్రధాన కార్యదర్శి ఉష, మీడియా కన్వీనర్ అంకెల జనార్ధన్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మదాసి రాజు, కాశిబుగ్గ మండల అధ్యక్షుడు అపురూప రజనీష్ నేత, శివనగర్ మండల అధ్యక్షుడు రఫీతో పాటు సీనియర్ నాయకులు మార్టిన్ లూథర్, రాజేందర్, సుజాత, నాగరాజు, రోహిత్, అరుణ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




# వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా రామారావు శిరీష రాము ఏకగ్రీవ ఎన్నిక
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి

**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 2 (తరంగాలు):** తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా నెక్కొండకు చెందిన వార్డు సభ్యులు రామారావు శిరీష రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జిల్లా ఇన్‌చార్జి రామారావు శిరీష రాము మాట్లాడుతూ.. జిల్లాలోని వార్డు సభ్యులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వార్డు సభ్యుల హక్కులు, సమస్యలు, స్థానికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఢఈ పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావించి, వార్డు సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.


TELANGANA WARD MEMBERS FORUM
Office : 5-5-2/29/4, Boduppal, Medchal Malkajgiri, Hyderabad - 500092
Reg No: 427/2026

Nagabelli Jyothi
(State Founding President)

Date: 2nd, September, 2026

Appointment Latter

Below are the appointment details for the District Incharge representing Warangal District

| S. No | Name | District | Designation |
|---|---|---|---|
| 1 | Ramarapu Shirisha | Warangal | District Incharge |

Appointment Details

We are pleased to formally appoint as the District Incharge for Warangal District under the Telangana Ward Members Forum.

- We are confident that you will execute your responsibilities with dedication, digital excellence, and commitment effectively amplifying the voice, initiatives, and welfare activities of the ward members across the district on all social media platforms.
- This appointment is formal and effective immediately.

Congratulations on your appointment, we wish you immense success in driving our communications and digital outreach forward.



తనపై నమ్మకంతో జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతికి, ఫోరం కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా రామారావు శిరీష రాము ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఫోరాన్ని మరింత బలోపేతం చేసి, వార్డు సభ్యుల ఐక్యతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ ..





- ఎంపీ బలరాంనాయక్
- వెయ్యి రోజుల్లో అభివృద్ధి చేసి చూపించాం - ఎమ్మెల్యే మురళి నాయక్
- అభివృద్ధి చూసి ఓర్వలేకనే అక్కసు - డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమా
- కేసముద్రంలో ఉరకలు వేస్తున్న అభివృద్ధి
- వేం చొరవతో కనీవినీ ఎరుగని రీతిలో కేసముద్రం
- కాంగ్రెస్ అంటే గడీల రాజ్యం కాదు ప్రజల రాజ్యం..మీరు చేయలేని అభివృద్ధిని చూసి ఓర్వలేని తనం
- వేం అన్న కు కేసముద్రం మండల ప్రజలు రుణపడి ఉంటారు - చిలువేరు సమ్మయ్య గౌడ్

**కేసముద్రం ప్రతినిధి, సెప్టెంబర్ 2,తరంగాలు** : అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక పేదలకు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మానుకోట ఎంపీ బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 1000 రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అవి అర్హులకు అందించినట్లు తెలిపారు. దళిత, గిరిజన, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డట్లు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూనే, మరో పక్క ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు.ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక గత బీఆర్ఎస్ 10 ఏళ్ల కాలంలో చేయలేని అభివృద్ధిని 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో చేసి చూపించామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. 1000 రోజుల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని చెప్పారు.రూ. 60 కోట్లతో మానుకోట మునిసిపాలిటీలో అభివృద్ధి కొనసాగుతుందని, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు అనేక పనులు జరుగుతున్నాయని తెలిపారు.రూ. 7 కోట్లతో బంధం చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా, రూ. 2 కోట్లతో మున్నిరు వాగు వద్ద బతుకమ్మ, వినాయక నిమజ్జన ఘాట్, రూ. 9 కోట్లతో దాశరథి స్మృతి వనం నిర్మించనున్నట్లు తెలిపారు.త్వరలో 400 ఎకరాల్లో రూ. 1000 కోట్లతో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.రూ. 350 కోట్లతో జిల్లా కేంద్రానికి ఓఆర్ఆర్ రాబోతుందని స్పష్టం చేశారు.కేసముద్రంలో రూ. 500 పండగల తోట అభివృద్ధి జరుగుతుందన్నారు.

– కేసముద్రం అభివృద్ధి పై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ...

గత ప్రభుత్వంలో అభివృద్ధిని మరుగున పడేసిన నాయకులు, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమాన్ని, మౌలిక వసతుల కల్పనను చూసి ఓర్వలేక లేనిపోని అబండాలు వేస్తున్నారని కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. పాలించడం చేతకాక, అభివృద్ధి చేస్తున్న వారిని వేలెత్తి చూపడం గత పాలకుల అహంకారానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. కేసముద్రం మండలంలో సుమారు రూ. 750 కోట్ల భారీ నిధులతో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు ఉరకలు వేస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే గడీల రాజ్యం కాదని, ఇది పూర్తిగా 'ప్రజల రాజ్యం' అని స్పష్టం చేశారు. నరేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే కేసముద్రం నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు సమకూరాయని సమ్మయ్య గౌడ్ కొనియాడారు. "కేసముద్రం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు, విద్య, సాగునీటి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామానికి ఈ అభివృద్ధి ఫలాలు సమానంగా అందుతున్నాయి" అని తెలిపారు. నిధుల సాధనలో, సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమిస్తున్న 'వేం అన్నా'కు కేసముద్రం ప్రజలు రుణపడి ఉంటారన్నారు.కేవలం మాటలకే పరిమితం కాకుండా పనుల నాణ్యత, సమయపాలనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. "రాజకీయ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం కాదు... ఏమైనా సూచనలు, లోపాలు ఉంటే చెబితే సరిదిద్దుతాం. కేవలం విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. మాటలతో కాదు, క్షేత్రస్థాయిలో జరిగే అభివృద్ధి పనులతోనే మేము సమాధానం చెబుతాం" అని స్పష్టం చేశారు.అధికారాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగించడమే కాంగ్రెస్ లక్ష్యమని, మండలంలో పెండింగ్‌లో ఉన్న మిగతా పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి కేసముద్రంను మోడల్ మండలంగా తీర్చిదిద్దుతామని సమ్మయ్య గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కేసముద్రం మండల ప్రజలు వేం నరేందర్ రెడ్డి కి ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే మురళి నాయక్ రుణపడి ఉంటారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఝాన్సీ ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, అర్బన్ అధ్యక్షుడు మనపురపు అంజయ్య, మండల అధ్యక్షుడు తెల్లంకొండ శ్రీనివాస్, పలువురు సుబ్బయ్య, అశోక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ బర్త్‌డే వేడుకల్లో జనసేన సేవా స్ఫూర్తి



**సంబరాలకు అతీతంగా..** సేవా కార్యక్రమాలతో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు రైతు శ్రామికులకు టిఫిన్ బాక్సులు..ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీజనసేన పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్ బర్ల శివ వర్ధన్నపేట, సెప్టెంబర్ 2 (తరంగాలు ప్రతినిధి): జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను వర్ధన్నపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో రైతు శ్రామికులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించడంతో పాటు వారికి టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు.వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్ బర్ల శివ మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా జనసేన పార్టీ ముందుకు సాగుతోందన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి జనసైనికుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.దఈ కార్యక్రమాల్లో ఆంజనేయులు రాజవారపు, నునవత్ స్వర్ణ సంతోష్ నాయక్, భైరపాక భరత్ కళ్యాణ్, కొత్తూరు అంజి, భాషిపాక రాజ్ కుమార్, మొగ్గుల రఘుమోహన్, పెల్లి రాజ్ కుమార్, తూళ్ళ శ్రవణ్, అంజయ్య, బర్ల విశాల్, మంద అన్వేష్, దుబ్బాక రాకేష్, శ్రీధర్ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- పవన్ కళ్యాణ్‌కు జనసేన నాయకుల జన్మదిన శుభాకాంక్షలు

**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 2,తరంగాలు** : జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నాయకులు కరాటే ప్రభాకర్ స్వగృహంలో మండల జనసేన పార్టీ కాంటెస్టెడ్ జడ్పీటీసీ అభ్యర్థి బిర్రు కుమారస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, శివకోటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# బిల్డింగ్ పై నుండి పడి కార్మికుడి మృతి

- నల్లబెల్లి గ్రామానికి చెందిన చెంగల యాదగిరి గౌడ్ దుర్మరణం
- యాదగిరి గౌడ్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు
- మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య



**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 2,తరంగాలు**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన చెంగల యాదగిరి గౌడ్ (41) బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్ లో ప్లంబర్ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు వారి పనిలో భాగంగా ఈ నెల 26 తేదీన నానాక్రామ్ గూడ డీఎస్ఆర్ టెక్ పార్క్ బిల్డింగ్ నిర్మాణంలో ఎలక్ట్రిషన్ పనులకు వెళ్ళిన యాదగిరి తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పనులు చేస్తుండగా 6వ అంతస్తు నిర్మాణంపై నుండి ప్రమాదవశాత్తు జారీ పడ్డాడు. యాదగిరి గౌడ్ జారీ పడిన సంధర్భంలో ఆయనతో ఉన్న తోటి కార్మికుడు అందుబాటులో లేకపోవడంతో ఎవరు గుర్తించలేదని తెలిపారు. కొంత సమయం తర్వాత పనులు జరుగుతున్న ప్రదేశానికి మరో కార్మికుడు వచ్చే సమయానికి యాదగిరిగౌడ్ కనిపించకపోవడంతో గృహ నిర్మాణదారులకు సమాచారమిచ్చారు. అనంతరం యాదగిరి కోసం వెతుకుతుండగా కింద పడి ఉండడం గమనించిన తోటి కార్మికుడు వచ్చి చూసే సమయానికి తలకు తీవ్ర గాయం కావడంవతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన అందుబాటులో ఉన్న ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే యాదగిరి గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పని సమయం ముగిసినా యాదగిరి గౌడ్ ఇంటికి రాకపోవడం సాయంత్రం 6 గంటల తర్వాత ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడంతో కంగారు పడిన మృతుడు యాదగిరి గౌడ్ భార్య తోటి కార్మికులకు ఫోన్ చేసి విషయం తెలుపగా వారు జరిగిన విషయాన్ని తెలిపారు. జరిగిన ప్రమాదాన్ని ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని అచేతనంగా పడి ఉన్న యాదగిరి గౌడ్ మృతదేహాన్ని చూసి గుండెలు పగిలేలా రోదించారు. కుటుంబ సభ్యుల రోదనలతో విషయం తెలుసుకున్న ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆగస్టు నెల 28న ఉస్మానియా ఆసుపత్రిలో యాదగిరి భౌతిక కాయానికి పోస్టుమార్టం నిర్వహించారు.యాదగిరి గౌడ్ మరణ వార్త తెలియడంతో స్వగ్రామమైన నల్లబెల్లి గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గత రెండు నెలల వరకు గ్రామంలో కుల వృత్తి చేసుకున్న యాదగిరి ప్రస్తుతం అన్ సీజన్ కావడంతో కుటుంబ పోషణకు హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుని కుటుంబానికే తీరని శోకం మిగలడంతో పాటు యాదగిరిగౌడ్ కుటుంబం రోడ్డున పడింది. మృతుడు యాదగిరి గౌడ్ కు ఇద్దరు కూతుళ్లు చెంగల అశ్విత(15), చెంగల అవంతిక, దివ్యాంగురాలు (11), కుమారుడు చెంగల నిక్షిత్ (7)లు ఉన్నారు. తండ్రిని కోల్పోయి అనాధగా మిగిలిన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని భార్య చెంగల శ్రీలత, గౌడ కులస్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.


# రామచందర్ రావుకు ఘన స్వాగతం గజమాలతో సత్కారం





- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

**పరకాల, సెప్టెంబర్ 3 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల పర్యటనలో భాగంగా హన్మకొండ జిల్లా పరకాలకు విచ్చేసిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు కడిపికొండ జంక్షన్ వద్ద బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆయనతో కలిసి పరకాల అమరధామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.అమరధామం కార్యక్రమం అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పరకాల అమరధామం (తెలంగాణ జలియన్‌వాలాబాగ్) చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు.ఈ సందర్భంగా తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను నాయకులు స్మరించుకున్నారు. తెలంగాణ చరిత్రలో పరకాల అమరధామానికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్, మాజీ శాసనసభ్యులు ధర్మారావు, కొండేటి శ్రీధర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రేమేందర్ రెడ్డి, కాలి ప్రసాద్తో పాటు పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సమస్యాత్మక ప్రాంతాలపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన





●ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్ల దుస్థితి, నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి

●నీటి నిల్వలు, గుంతలు తొలగించాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 2, తరంగాలు:**రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతంలో రోడ్డుపై ఏర్పడుతున్న నీటి నిల్వలు, గుంతల కారణంగా ట్రాఫిక్‌కు ఏర్పడుతున్న అంతరాయాన్ని పరిశీలించారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అలాగే లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కొత్త బస్టాండ్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్ణీత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనుల సమయంలో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఏడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో వరంగల్ సుమ, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## ఓటరు సవరణ హియరింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

●ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి:

●కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 2 (తరంగాలు):**ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మంగళవారం కాశీబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం, వరంగల్ మండల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఓటరు హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. వరంగల్ ఆర్డీవోతో కలిసి ఆయా కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్.. సమగ్ర ఓటరు సవరణకు సంబంధించి ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, అభ్యంతరాలపై నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. అధికారుల నుంచి ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు.సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తు, అభ్యంతరాన్ని ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# బకాయిలు ఉన్న మిల్లులను తనిఖీ చేయండి మేము సహకరిస్తాం

●బకాయిలు లేని మిల్లర్లను వేధించడం ఆపాలి

● రైస్ మిల్లర్ అసోసియేషన్

**నల్లగొండ, సెప్టెంబర్ 2 (తరంగాలు):**

రాష్ట్రంలో రైతు ఒక కన్ను అయితే.. రైస్ మిల్లర్ మరో కన్ను అని నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ పేర్కొంది. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, మిల్లింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేసింది.బకాయిలు ఉన్న మిల్లులను తనిఖీ చేసి, డిఫాల్టర్ మిల్లర్ల నుంచి ప్రభుత్వ బకాయిలు వసూలు చేయడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. అయితే బకాయిలు లేని మిల్లులను కూడా తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం, 90 శాతం మంది మిల్లర్లను దొంగలు, దోపిడీదారులుగా ముద్ర వేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేసింది.

### బాయిల్డ్ రైస్‌పై స్పష్టత ఇవ్వాలి

ఆగస్టు 28 నుంచి బాయిల్డ్ రైస్ తీసుకోకుండా సీమర్ నిలిపివేయడంతో మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ తెలిపింది. బాయిల్డ్ రైస్ తీసుకోబోమనే నిర్ణయాన్ని కనీసం వారం రోజుల ముందుగానే మిల్లర్లకు తెలియజేయాల్సిందని పేర్కొంది. ఇప్పటికే బాయిల్డ్ రైస్ నిల్వలతో మిల్లులు నిండిపోయాయని, కొత్తగా వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి స్థలం లేక పాడయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేసింది.మిల్లింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే 25 శాతం పెనాల్టీ విధిస్తున్న ప్రభుత్వం, 12 శాతం వడ్డీ ఎందుకు వసూలు చేస్తోందని ప్రశ్నించింది. రా రైస్ ఇవ్వడం సాధ్యం కాదని, అలాంటి పరిస్థితుల్లో ధాన్యాన్ని ప్రభుత్వమే తీసుకోవాలని కోరింది.

### కొత్త ధాన్యం కేటాయింపుపై కీలక డిమాండ్లు



ప్రస్తుత సమస్యలు పరిష్కారమయ్యే వరకు కొత్త ధాన్యాన్ని కేటాయించవద్దని మిల్లర్లు కోరారు. 2026--27 వానాకాలం ధాన్యాన్ని ప్రభుత్వ గిడ్డంగుల్లోనే భద్రపరచాలని, టెస్ట్ మిల్లింగ్ నిర్వహించిన తర్వాతే మిల్లులకు ధాన్యం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

2014 నుంచి 2025 వరకు ప్రభుత్వం సుమారు 9.70 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, మిల్లర్ల సామర్థ్యానికి మించి 200 శాతం వరకు ధాన్యాన్ని దిగుమతి చేసిన సందర్భాలున్నాయని తెలిపారు. ప్రస్తుతం 7 లక్షల టన్నుల రబీ ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారని పేర్కొన్నారు.
రా రైస్, బాయిల్డ్ రైస్ కేటాయింపుల్లో స్పష్టమైన విధానం ఉండాలని కోరుతూ.. రెండు లారీలకు 67 శాతం రా రైస్, మరో రెండు లారీలకు 68 శాతం బాయిల్డ్ రైస్ ఇవ్వాలనే విధానాన్ని అమలు చేయాలని కోరారు.

### షార్టేజీలు,ఖాళీ బస్తాలతో భారీ నష్టం

షార్టేజీల కారణంగా మిల్లర్లకు భారీగా నష్టం వస్తోందని అసోసియేషన్ తెలిపింది. ఖాళీ బస్తాల్లో ఖాప్రా పురుగు సమస్యతో బియ్యం రిజెక్ట్ అవుతోందని పేర్కొంది. గత పదేళ్లుగా ఖాళీ బస్తాలు మిల్లుల్లోనే ఉండిపోవడంతో 25 శాతం వరకు డ్యామేజ్ అవుతున్నాయని, వాటికి సంబంధించిన లెక్కలు ఇప్పటికీ తేల్చలేదని తెలిపింది.

### 40 ఏళ్లుగా మారని వర్కింగ్ చార్జీలు

మిల్లర్లకు చెల్లిస్తున్న రూ.10, రూ.20 వర్కింగ్ చార్జీలు సుమారు 40 ఏళ్లుగా మారలేదని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. వర్కింగ్, ట్రాన్స్‌పోర్ట్, డ్రేజీ, కస్టోడియన్ చార్జీలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. 2022--23 రబీ టెండర్ ధాన్యానికి సంబంధించిన చార్జీలు కూడా చెల్లించలేదని పేర్కొంది. ఇప్పటికే చార్జీలు చెల్లించకుండా మిల్లర్లపై ఆర్థిక భారం మోపుతున్న సమయంలో మళ్లీ మార్కెట్ ఫీజు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడం సరికాదని తెలిపింది. మార్కెట్ లైసెన్సులు రెన్యూవల్ చేయకుండా మిల్లర్లను ఇబ్బంది పెట్టవద్దని కోరింది.

### మిల్లింగ్ పరిశ్రమను కాపాడాలి

ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగానే మిల్లింగ్ చార్జీలు చెల్లించాలని రైస్ మిల్లర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమస్యలు పరిష్కారం కాకుండా మిల్లింగ్ పరిశ్రమలు తీవ్ర నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నెల రోజుల పాటు మిల్లులు మూతపడితే ఒక్కో మిల్లుపై సుమారు రూ.15--20 లక్షల వరకు నిర్వహణ భారం పడుతుందని తెలిపింది.
"ప్రభుత్వానికి మేము అన్ని విధాలా సహకరిస్తున్నాం. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు ఒక కన్ను అయితే రైస్ మిల్లర్ మరో కన్ను. రైతు--మిల్లర్ కలిసి నడిస్తేనే దేశం బాగుపడుతుంది. ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు.. సమస్యల పరిష్కారం కోసమే మా విజ్ఞప్తి" అని నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

## సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

●ఆదాయ వనరులు పెంచే లాభదాయక ప్రాజెక్టులను గుర్తించాలి -జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 2, తరంగాలు** :సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.
వరంగల్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి, ఆర్థిక బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు. సహకార సంఘాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం, ఆదాయ వనరులను పెంపొందించడం, సంఘాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులపై సమీక్షించారు.సహకార సంఘాల పరిధిలో పెద్ద ఎత్తున గోడౌన్ల నిర్మాణం చేపట్టి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అదనపు ఆదాయ వనరులను సమకూర్చే అవకాశాలపై చర్చించారు.అలాగే మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేయడం, అర్హత కలిగిన సహకార సంఘాల ద్వారా విత్తన శుద్ధి, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు.సేంద్రీయ ఎరువుల తయారీ, సంబంధిత కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా సహకార సంఘాలకు అదనపు ఆదాయ వనరులు కల్పించే అవకాశాలపై కూడా చర్చించారు.సహకార సంఘాల దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కోసం ఆదాయాన్ని సమకూర్చే, లాభదాయకమైన ప్రాజెక్టులను గుర్తించి అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధిత శాఖలు, ఆర్థిక సంస్థలతో సమన్వయం చేసుకుని తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లాలోని సహకార సంఘాల అభివృద్ధికి దోహదపడే ఉత్తమ ప్రాజెక్టులను గుర్తించి, వాటి అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో కన్వీనర్‌గా జిల్లా సహకార అధికారి ఎం. నీరజ వ్యవహరించారు. డీసీసీబీ సీఈఓ, నాబార్డ్ డీడీఎం, ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ అధికారులు, పశుసంవర్ధక శాఖ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొని తమ సూచనలు అందించారు.

## శాంతిభద్రతలే తొలి ప్రాధాన్యం సీఐ సంజీవరావు

●ప్రజల సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలి

● ప్రజలకు అందుబాటులో ఉంటా... ప్రజలు పోలీసుల సమన్వయంతో మెరుగైన సేవలు

●నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండదు

●వర్ధన్నపేట సీఐగా సంజీవరావు బాధ్యతల స్వీకరణ




**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 3 (తరంగాలు):**నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండదని వర్ధన్నపేట సీఐ సంజీవరావు అన్నారు. వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సంజీవరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పోలీసు సేవలు అందిస్తామని తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని, నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యతగా పనిచేస్తామని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ సంజీవరావు కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది నూతనంగా బాధితులు స్వీకరించిన సిఐ కి ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 03 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- ఉత్సవాల ఏర్పాట్లు, నిమజ్జనంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలిలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
- వర్షాభావ పరిస్థితులకు అనుకూలంగా పర్యావరణ పరిరక్షణ అనుకూలంగా పండుగ జరుపుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రతిష్టించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ
- శాఖల అధికారులతో పోలీస్ కమిషనర్ సమన్వయ సమావేశం




**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 2,తరంగాలు** : గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో పోలీస్ కమిషనర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య, మైనింగ్, మత్స్య, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు.

ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ... గణపతి నవరాత్రులను భక్తులు, నిర్వాహకులు పోలీసు, అధికార యంత్రాంగం సూచనలను పాటిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించాలని కోరారు. పర్యావరణహితంగా గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్టించుకోవాలని సూచించారు. గణపతి మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు మంటపాల నిర్వాహకులు పాటించాలన్నారు.అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. ప్రమాద నివారణ మార్గాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. గణపతి మంటపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని కోరారు. పోలీస్ అధికారులు ప్రతీ మండపాన్ని తనిఖీ చేస్తారని అన్నారు. మండపాల వద్ద సౌండ్ పొల్యూషన్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత ఎలాంటి సౌండ్ ఉండడొద్దన్నారు. చదువుకునే పిల్లలకూ, అనారోగ్యంతో భాదపడే వారికి సౌండ్ విషయంలో జాగ్రత్త వహించాలన్నారుతప్పని పరిస్థితిలో ఏదైనా సాంస్కృతిక కార్యక్రమం ఉంటే లోకల్ ఏసీపీ పర్మిషన్ తీసుకోవాలన్నారు.పెద్ద మండపల వద్ద భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నప్పుడు క్యూ లైన్లు పెట్టి బారికేడింగ్ చేయాలన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వాహకులు టైమింగ్స్ ని తప్పకుండ పాటించాలన్నారు.నవరాత్రులకు ఉపయోగించే వాహనాల సేఫ్టీని ముందుగా చెక్ చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా మండపాల వద్ద భద్రతకోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఏల్ నీనో పరిస్థితుల నేపథ్యంలో....నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకొని పెద్ద విగ్రహాలు కాకుండా చిన్న విగ్రహాలు అందులోనూ మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని కోరారు. భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రులను నిర్వహించుకోవాలని సూచించారు. అదేవిధంగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు అన్ని ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వినాయక విగ్రహాల నిమజ్జన ప్రక్రియను సురక్షితంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, చెరువుల నీటి మట్టం, లోతు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లు, లైటింగ్, బారికేడ్లు, వైద్య సిబ్బంది తదితర అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పెద్ద పెద్ద మండపాల వద్ద ఏర్పాట్లను విద్యుత్, ఇతర శాఖల అధికారులు తరచుగా తనిఖీలను నిర్వహించాలని పేర్కొన్నారు.గణపతి నవరాత్రుల లో ఎమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712685048 కి సమాచారం అందించాలన్నారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన కార్యక్రమాల కోసం ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి లేకుండా, వారి స్థానిక ప్రాంతాలకు సమీపంలోనే అనువైన నిమజ్జన ప్రాంతాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.వర్షాభావ పరిస్థితులకు అనుకూలంగా పర్యావరణ పరిరక్షణ అనుకూలంగా పండుగ జరుపుకోవాలన్నారు.గణేష్ నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్ ప్రణాళికలను ముందుగానే పకడ్బందీగా రూపొందించాలని, చివరి నిమిషంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు.నిమజ్జనం సమయంలో క్రేన్ డ్రైవర్ల ఎంపిక కీలకమన్నారు.నిమజ్జన కార్యక్రమాల్లో చిన్నపిల్లలు, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటును ప్రోత్సహించాలి

ఉత్సవ కమిటీలకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విజ్ఞప్తి

వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణహితంగా, ప్రశాంత వాతావరణంలో అన్ని వర్గాల సమన్వయంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఉత్సవ కమిటీలకు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసేలా ప్రజలను, ఉత్సవ కమిటీలను ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి సంవత్సరం కాలుష్య నియంత్రణ శాఖతో పాటు వివిధ సంస్థలు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందిస్తున్నాయని తెలిపారు.ఈ ఏడాది నీటి లభ్యత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గణేష్ విగ్రహాల పరిమాణాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి జిల్లాలో తక్కువ వర్షాలు, నీటి నిల్వల పరిస్థితుల్లో మార్పులు ఉన్నందున నిమజ్జనం విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పెద్ద విగ్రహాల ఏర్పాటు విషయంలో పోటీ పడకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వినాయక చవితి పండుగను ఆనందోత్సాహాలతో, స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

గత ఏడాది ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటుపై పోటీ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలని కోరారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణానికి మేలు కలగడంతో పాటు నిమజ్జనం సమయంలో నీటి వనరులపై భారం తగ్గుతుందని తెలిపారు.

అదేవిధంగా, రోడ్లపై ఉత్సవ ఏర్పాట్ల కోసం శాశ్వత నిర్మాణాలు లేదా రోడ్లకు నష్టం కలిగించే విధంగా పనులు చేపట్టవద్దని ఉత్సవ కమిటీలను కోరారు. రోడ్లకు నష్టం కలిగితే వాటి పునరుద్ధరణకు సమయం పడుతుందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా వాహనాల రాకపోకలు, ప్రజల సౌకర్యం, విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

గతంలో మాదిరిగానే ఈసారి కూడా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర అన్ని శాఖల నుంచి ఉత్సవ కమిటీలకు పూర్తి సహకారం అందుతుందని తెలిపారు.

ప్రతి పండుగను కుల, మతాలకు అతీతంగా సోదరభావం, మత సామరస్యం, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఉండాలని అన్నారు.

ముఖ్యంగా రాత్రి వేళల్లో ఉత్సవ ప్రాంగణాలలో భద్రతా చర్యలు, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉత్సవాల విజయవంతంగా నిర్వహణకు పూర్తి సహకారం అందిస్తారని, అదే సందేశాన్ని ఉత్సవ కమిటీలు ప్రజలకు చేరవేసి అందరూ కలిసి సంతోషకరమైన వాతావరణంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ... గణేశ్ నిమజ్జనోత్సవాన్నిపురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.గణేశ్ మండపాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడతామని, అదేవిధంగా గణేశ్ నిమజ్జన పాయింట్ల వద్ద పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.నిమజ్జన రూట్లలో అవసరమైన రోడ్డు మరమ్మతులు, ఇతర మౌలిక వసతుల కల్పనను ఇంజనీరింగ్ విభాగం చేపడుతామని పేర్కొన్నారు.

విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో నిమజ్జన మార్గాల్లో అవసరమైన చోట్ల లైటింగ్, ఇతర విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ాఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, జనగాం అదనపు కలెక్టర్ బెన్ షా లోం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏసీపీలు,
ఇతర పోలీస్ అధికారులు,వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లా లకి సంబందించిన ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి





- డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదయ్యే సమాచారం భవిష్యత్తులో వివిధ వ్యవసాయ సేవలకు కీలక ఆధారం
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఐనవోలు మండలం పంథిని గ్రామ పరిధిలోని చింతకుంట లో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ను పరిశీలించిన కలెక్టర్

**ఐనవోలు, సెప్టెంబర్ 2,తరంగాలు** : రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్ లో పకడ్బందీగా నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామ పరిధిలోని చింతకుంట లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతున్న తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే నంబర్ల వారీగా వివరాల నమోదు, సాంకేతిక వ్యవస్థ పనితీరు, జియో మ్యాపింగ్, పంటల ఫొటోల నమోదు, తదితర అంశాలను పరిశీలించడంతో పాటు స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా ప్రతి రైతుకు సంబంధించిన సర్వే నంబర్‌లో సాగు చేస్తున్న పంట రకం, సాగు విస్తీర్ణం తదితర వివరాలను డిజిటల్ యాప్ లో నమోదు చేయాలన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదయ్యే సమాచారం భవిష్యత్తులో వివిధ వ్యవసాయ సేవలకు కీలక ఆధారంగా మారే అవకాశం ఉన్నందున, ఎలాంటి తప్పులు లేకుండా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఏడీఏ రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి సునీల్, పంపిణీ గ్రామ సర్పంచ్ శ్రీరామ్ భూపాల్, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కఠిన శిక్షే సరైన సమాధానం

- అత్యాచారం,హత్యకు పాల్పడిన నిందితుడిని వదలొద్దు..
- ఆదివాసి నర్సు శిరీష హత్యపై రాష్ట్ర పాలసీ రీసెర్చ్ కో-కన్వీనర్ గుగులోతు స్వరూప ఆగ్రహం
- ఆదివాసి బిడ్డ ప్రాణానికి విలువ లేదా? శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- మహిళల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- మహిళల భద్రత ఎక్కడ? శిరీష హత్యపై ప్రభుత్వాన్ని నిలదీసిన స్వరూప



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 2,తరంగాలు** : ఆదివాసి, గిరిజన నర్సింగ్ విద్యార్థిని ఊకె శిరీషపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకుండా కఠినంగా శిక్షించాలని బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర పాలసీ రీసెర్చ్ కో-కన్వీనర్ గుగులోతు స్వరూప డిమాండ్ చేశారు. శిరీష హత్య ఘటన అత్యంత దారుణమని, మహిళల భద్రతపై ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.శిరీషను కోల్పోయిన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని పేర్కొన్న స్వరూప బాధిత కుటుంబానికి తక్షణమే తగిన నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివాసి బిడ్డ ప్రాణానికి విలువ లేదా? అని ప్రశ్నించారు.మహిళలు, ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన మహిళలు భయాందోళనలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరమని ఆమె అన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు పునరావృతం కాకుండా కఠిన చట్టాల అమలు, వేగవంతమైన దర్యాప్తు, నిందితులకు శీఘ్ర శిక్షలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఇచ్చిన హామీలను కార్యాచరణలో చూపించాల్సిన సమయం ఆసన్నమైందని స్వరూప అన్నారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, ఆదివాసీ సమాజం తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శిరీషకు న్యాయం చేయడమే లక్ష్యం.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# టాస్ వేయడానికే రోజంతా పడుతుంది

### పాక్‌ను ట్రోల్ చేసిన పీటర్సన్!

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకు పోయింది. మూడో టెస్టుకు ముందే మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘాలతో సహా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపివేస్తూ పీసీబీ తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను ఇంటికి పంపి వారి స్థానంలో ఐదుగురు అరంగేట్రం చేయని కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు, మాజీ క్రికెటర్లు పెద్ద ఎత్తున వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఈ పరిణామాలపై ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ తనదైన శైలిలో స్పందించాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌పై హాస్యభరితమైన కామెంట్లు చేశారు. "ప్రతి మ్యాచ్‌కి ముందు జరిగే విలేకరుల సమావేశంలో జట్లలో జరిగిన మార్పుల గురించి వ్యాఖ్యాతలు కెప్టెన్లను అడుగుతారు. ఇప్పుడు నా ఫ్రెండ్ బాబర్‌కు అది చాలా సుదీర్ఘమైన సమావేశం కానుంది. ఈ లెక్కన టాస్ వేసే ఘట్టం మ్యాచ్‌కి ఒక రోజు ముందే ప్రారంభించాలేమో" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా కూడా తన సొంత క్రికెట్ బోర్డుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. "క్రికెట్ చరిత్రలో సిరీస్ మధ్యలో ఒక జట్టు ఇలా ఏడుగురు ఆటగాళ్లను, కోచ్‌లను మార్చడం నేను ఎప్పుడూ చూడలేదు. పాకిస్థాన్ నిజంగా ఒక కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లా ఉంది.. సీజన్ మధ్యలోనే మేనేజర్‌ను తీసేసినట్లు చేస్తున్నారు. మరో పది రోజులు ఆగి సిరీస్ ముగిసాక ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అని రమీజ్ రజా పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు ముందు పాక్ జట్టులో మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, అరాఫత్ మిన్హాస్, ఇమ్రాన్ రంధావా వంటి ఐదుగురు అన్ క్యాప్డ్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. వీరికి తోడు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి వారి స్థానంలో మైక్ హెస్సన్, యాష్లే నాఫ్కేలను నియమించారు. ఎన్నో వివాదాలు, ట్రోల్స్ మధ్య సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఆఖరి టెస్టులో బాబర్ సేన ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

# వినాయక వేడుకలు ప్రశాంతంగా సాగాలి

- వినాయక వేడుకలకు పోలీసుల భరోసా!
- శాంతి, సోదరభావంతో ఉత్సవాలు నిర్వహించాలి: డీసీపీ అనికేత్ కుమార్



**వరంగల్, సెప్టెంబర్ 2, తరంగాలు:**
వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ అనికేత్ కుమార్ సూచించారు. మామునూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన శాంతి సమావేశంలో సుమారు 300 మంది వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.గత ఏడాది పరిధిలో సుమారు 830 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినా, ప్రజల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి సంబంధిత శాఖల అనుమతులు పొందాలని సూచించారు. లౌడ్‌స్పీకర్ల వినియోగం, ట్రాఫిక్, విద్యుత్ భద్రత, నిమజ్జన మార్గాలు, సమయాలకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.మామునూర్ ఏసీపీ ఎన్. వెంకటేష్‌తో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల కట్టడికి అవగాహనే ఆయుధం

- మట్టేవాడ ఎస్సై రాజేందర్
- మట్టేవాడ స్కూల్‌లో సైబర్ నేరాలపై అవగాహన




**వరంగల్, సెప్టెంబర్ 3 (తరంగాలు):** సైబర్ నేరాల కట్టడికి అవగాహనే ఆయుధం అని మట్టేవాడ ఎస్సై రాజేందర్ అన్నారు. సైబర్ జాగ్రుక్త దివస్‌లో భాగంగా మట్టేవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మట్టేవాడ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టేవాడ ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.డిజిటల్ పేమెంట్స్, డిజిటల్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ల పేరుతో జరిగే మోసాలు, లైంగిక వేధింపులు, ఫొటో మార్ఫింగ్ తదితర సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు డయల్ చేయాలని తెలిపారు.అలాగే గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు, సుమారు 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# తేలిపోనున్న రోహిత్ భవితవ్యం..

### బీసీసీఐ కీలక సమావేశం

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అత్యున్నత స్థాయి సమావేశానికి సిద్ధమైంది. గురువారం ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో ఈ మీటింగ్ నిర్వహించనుంది. ఈ సమా వేశానికి సంబంధించిన ఎజెండాను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఐర్లాండ్, ఇంగ్లండ్, శ్రీలంక పర్యటనల్లో భారత జట్టు ప్రదర్శనపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ హాజరుకానున్నారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వర్చువల్‌గా పాల్గొననున్నాడు. సీసీ టీ20 ప్రపంచ కప్ విజయానంతరం.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ జట్టు దారుణంగా విఫలమైంది. వరుసగా 6 టీ20 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించలేకపోయింది. ఈ ఫలితాలపై బీసీసీఐ అప్పట్లోనే ఆందోళన వ్యక్తం చేసింది.ఈ వైఫల్యాలపై ఖచ్చితంగా సమీక్ష చేస్తామని సెక్రటరీ దేవజిత్ సైకియా అప్పట్లోనే మీడియాకు తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల ఈ సమావేశం ఇప్పటి వరకు జరగలేదు.భారత జట్టు ప్రదర్శనతో పాటు భవిష్యత్తు ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ భవితవ్యంపై బీసీసీఐ, సెలెక్షన్ కమిటీల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. వన్డే ప్రపంచకప్ 2027 వనకు రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం కష్టమని వార్తలు వచ్చాయి. రోహిత్ రిటైర్మెంట్ అంటూ కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తలను బీసీసీఐ ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ భవితవ్యంపై కూడా ఈ సమావేశంలో చర్చించినున్నట్లు తెలుస్తోంది. జట్టులో కొనసాగించాలా? వద్దా? అనేదానిపై బీసీసీఐ, మేనేజ్‌మెంట్ ఏకాభిప్రాయానికి రానుంది. ఈ సమావేశం అనంతరం రోహిత్ భవితవ్యంపై స్పష్టత రానుంది.